

ఫుడ్ అండ్ ఇన్స్ ఫ్యాక్టరీ వద్ద నిలిచి ఉన్న ట్రాక్టర్లు

మామిడి రైతులకు ఊరట

● కలెక్టర్ ఆదేశాలతో సిఫార్సులకు చెక్

● నేటినుంచి 150వాహనాల వరకు అనుమతికి చర్యలు

గుడిపాల, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మామిడి రైతులకు ఊరట కల్గించేలా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు. 'అన్‌లోడింగుకు దారేది?' శీర్షికన గురువారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై ఆయన తీవ్రంగా స్పందించారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆర్డీవో శ్రీనివాసులు, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎస్ఐ రామ్మోహన్‌కు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. రోజూ 150 నుంచి 200 ట్రాక్టర్ల వరకు ఫ్యాక్టరీలోకి పంపించేలా చూడాలన్నారు. సిఫార్సులకు స్వస్తి పలికి రైతులు తీసుకొచ్చిన మామిడి కాయలను ఒకటి, రెండ్రోజుల్లోగా అన్‌లోడ్ అయ్యేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కాగా, గురువారం కూడా తాసా ఫ్యాక్టరీకి సంబంధించి చీలాపల్లె మిట్ట వరకు ట్రాక్టర్లు నిలిచిపోగా.. గొల్లమడుగు వద్ద ఉన్న ఫుడ్ ఇన్స్ ఫ్యాక్టరీ నుంచి తమిళనాడు సరిహద్దులోని బాంబుల ఫ్యాక్టరీ వరకు వాహనాలు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో రైతులతో తహసీల్దార్ శ్రీనివాసులు మాట్లాడారు. ఇకపై టోకెన్లను జారీ చేస్తామని, సీరియల్ ప్రకారం అన్‌లోడ్ చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. పంట పూర్తిగా ఫ్యాక్టరీకి తోలేవరకు ప్రభుత్వం ప్రకటించిన సబ్సిడీ రైతుల ఖాతాల్లో జమ చేస్తామని భరోసా ఇచ్చారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



విత్తనాలతో జగన్నాథుడి చిత్తరువు

కుప్పం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): పూరీ జగన్నాథుడు విత్తనాలలో ఒదిగిపోయాడు. సుందరాకారంలో దర్శనమిచ్చాడు. ప్రపంచంలోనే అతిపెద్ద రథోత్సవమైన పూరీ జగన్నాథుడి రథోత్సవాన్ని పురస్కరించుకుని కుప్పానికి చెందిన పురుషోత్తం (పూరి ఆర్ట్స్) వివిధ రకాల పువ్వులు, కూరగాయల విత్తనాలతో పూరీ జగన్నాథుడి చిత్రాన్ని రూపొందించారు. ఈ చిత్రం ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

వార్డు కార్యదర్శుల బదిలీలకు కౌన్సెలింగ్

● నేటినుంచి చిత్తూరు నాగయ్య కళాక్షేత్రంలో నిర్వహణ



వివరాలు తెలియజేస్తున్న కమిషనర్ నరసింహ ప్రసాద్

చిత్తూరు అర్బన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని నగరపాలక సంస్థలు, మున్సిపాలిటీల పరిధిలోని వార్డు కార్యదర్శుల బదిలీల కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను చిత్తూరు నగరపాలక సంస్థ కమిషనర్ నరసింహ ప్రసాద్ గురువారం విడుదల చేశారు. ఈ ప్రక్రియను ఈనెల 30వ తేదీలోపు పారదర్శకంగా పూర్తి చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. చిత్తూరు ఉమ్మడి జిల్లా పరిధిలోని తిరుపతి, చిత్తూరు నగరపాలక సంస్థలతోపాటు మదనపల్లె, శ్రీకాళహస్తి, పలమనేరు, పుంగనూరు, నగరి, పుత్తూరు, కుప్పం పురపాలక సంఘాల పరిధిలోని వార్డు కార్యదర్శుల బదిలీలకు సంబంధించి జిల్లా స్థాయి కమిటీని ఏర్పాటు చేశారు. వార్డు కార్యదర్శులకు శుక్ర, శనివారాల్లో నాగయ్య కళాక్షేత్రంలో బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియ జరుగుతుందన్నారు. శుక్రవారం ఉదయం 10.30 గంటల నుంచి వార్డు అడ్మినిస్ట్రేషన్ సెక్రటరీ, వార్డు అమినిటీ సెక్రటరీ, వార్డు ప్లానింగ్ అండ్ రెగ్యులేటరీ సెక్రటరీలకు కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. శనివారం ఉదయం 10.30గంటల నుంచి వార్డు వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సెక్రటరీ, వార్డు ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీలకు కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు.



జనావాసాల్లోకి వచ్చిన దుప్పి మృతి

పెనుమూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): సమీప అడవి నుంచి పెనుమూరు మండలంలోని రామాపురం గ్రామంలోకి ఓ దుప్పి గురువారం వచ్చింది. ప్రజలను చూసి అటూ ఇటూ పరుగెత్తడంతో తీవ్రగాయాలయ్యాయి. గ్రామస్తులు వెటర్నరీ డాక్టరుకు సమాచారం ఇవ్వడంతో ఆయనొచ్చి ప్రథమ చికిత్స చేశారు. అయినా ఫలితం లేకపోవడంతో మరణించింది. విషయం తెలుసుకున్న ఫారెస్టు ఆఫీసర్ వందన్ ఆ దుప్పికి పోస్టుమార్టం చేసి పూడ్చిపెట్టారు.

చాపకింద నీరులా గంజాయ్



● ప్రతి మండలంలోనూ అందుబాటులోకి..!

● కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక 235 కిలోల స్వాధీనం

● టాస్క్‌ఫోర్స్ టీమ్‌తో ప్రత్యేక దాడులు

● వైసీపీ హయాం నుంచే పెరిగిన అమ్మకాలు, వాడకం

కారణాలు ఎన్ని ఉన్నా ఒకప్పటితో పోల్చుకుంటే జిల్లాలో గంజాయి వాడకం బాగా పెరిగింది. కూటమి ప్రభుత్వం నివారణకు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా, జిల్లాలో ప్రతి మండలంలోనూ గంజాయి లభిస్తోందంటే పరిస్థితులు అదుపు తప్పాయనేది తెలుస్తోంది. ఈ ఏడాది కాలంలోనే జిల్లాలో విపరీతంగా గంజాయి కేసులు నమోదు చేసి, నిందితులను అరెస్టు చేశారు.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

2014-19 టీడీపీ హయాంలో..	2019-24 వైసీపీ హయాంలో..	2024 నుంచి.. (ఒక ఏడాదిలో..)
కేసులు : 17	కేసులు : 169	కేసులు: 68
నిందితులు : 45	నిందితులు : 496	నిందితులు: 194
పట్టుబడింది : 62 కిలోలు	పట్టుబడింది : 1,166 కిలోలు	పట్టుబడింది: 235 కిలోలు

వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లలో మన జిల్లాలో గంజాయి అమ్మకాలు, వాడకం విపరీతంగా పెరిగింది. విశాఖ, అల్లూరి సీతారామరాజు జిల్లాల నుంచి గంజాయి తెచ్చుకుంటున్నారు. ఆమధ్యలో చిత్తూరు నగరంలో ఓసారి 15, మరోసారి 14 కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. 2014-19 సంవత్సరాల మధ్య టీడీపీ ప్రభుత్వం హయాంలో 17 కేసుల్లో 62 కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో 169 కేసుల్లో ఏకంగా 1,166 కిలోల గంజాయిని పట్టుకున్నారు. అప్పట్లో 45 మందిని అరెస్టు చేస్తే, వైసీపీ హయాంలో 496 మంది అరెస్టయ్యారు. ఇదిలా ఉండగా.. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలో 68 కేసుల్లో రూ.36 లక్షల విలువ చేసే 235 కిలోల గంజాయిని పట్టుకుని, 235 మందిని అరెస్టు చేశారు. ఈ స్థాయిలో కేసులు నమోదు చేశారంటే వాడకం కూడా అదే స్థాయిలో ఉందనే అర్థం వస్తోంది.

విద్యార్థులు, కూలీల వాడకం..

జిల్లా మీదుగా సరఫరాతోపాటు జిల్లావాసులు కూడా పెద్ద ఎత్తున గంజాయి వాడుతున్నారనే విషయం ఆందోళనకు గురి చేస్తోంది. చిత్తూరు, పలమనేరు, పుంగనూరు వంటి పట్టణ ప్రాంతాల్లోనే కాకుండా మండలాల్లో కూడా వాడకం పెరిగిందని పోలీసులు లెక్కలు చెప్తున్నాయి. వైసీపీ హయాంలో అయితే గంగవరం, కుప్పం, పెద్దపంజాణి, రామకుప్పం, వి.కోట వంటి ప్రాంతాల్లో గంజాయి మొక్కల్ని సాగు కూడా చేసేవారు. విద్యార్థులు పెద్దఎత్తున గంజాయిని వాడుతుండగా.. ఆ తర్వాతి స్థానంలో రోజువారి కూలీలున్నారు. గంజాయిని కట్టడి చేయాలని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జిల్లాలో టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. సివిల్ డ్రెస్సులు ధరించిన పోలీసులు రైల్వేస్టేషన్లు, బస్టాండుల్లో విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు.

ఈగల్ క్లబ్‌ల ఏర్పాటుపై నిర్లక్ష్యం..

గంజాయిని ఆరు నెలల్లో లేకుండా చేస్తామని గతేడాది నవంబరులో ప్రకటించిన ప్రభుత్వం ఎలైట్ యాంటీ నార్కోటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఈగల్)ను ఏర్పాటు చేసింది. దానికి సంబంధించిన ఎలాంటి కార్యక్రమాలూ జిల్లాలో ప్రారంభం కాలేదు. పాఠశాలలు, కళాశాలలు, ఉన్నత విద్యాసంస్థల్లో ఈగల్ క్లబ్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఒక్కో క్లబ్‌లో ఉపాధ్యాయులు/ అధ్యాపకులు, విద్యార్థులు కలిపి మొత్తం 10 మంది సభ్యులుగా ఉండాలి. వీటి ఏర్పాటుపై ఎవరూ దృష్టి సారించడం లేదు. నేటికీ చాలా విద్యాసంస్థల్లో ఇవి ఏర్పడలేదు.

అప్పట్లో వైసీపీ.. ఇప్పుడు టీడీపీ కార్యకర్తలు

వైసీపీ హయాంలో ఆ పార్టీ క్షేత్రస్థాయి కార్యకర్తలు గంజాయి అమ్మకాలు చేపట్టి సొమ్ము చేసుకోగా.. ఇప్పుడు ఆ పనిని టీడీపీ కార్యకర్తలు చేస్తున్నారు. గతేడాది నవంబరులో గంగవరంలో పోలీసులు దాడిచేసి గంజాయిని పట్టుకోగా, టీడీపీ కార్యకర్త దొరికారు. ఈమధ్య చిత్తూరులో కూడా టీడీపీ కార్యకర్తల మధ్య గంజాయి అమ్మకాల కోసం ఘర్షణ జరిగినట్లు తెలుస్తోంది. అలాగే, గ్రానైట్ ఫ్యాక్టరీల్లో పనిచేసే బయటి రాష్ట్రాల కూలీలు కూడా అమ్మకాలు, వాడకం చేస్తున్నారు. తాజాగా గుడిపాలలోని ఓ ఫ్యాక్టరీలో గంజాయి అమ్ముతున్న కూలీని పోలీసులు పట్టుకున్నారు.



ప్రజలు, అధికారులతో కలిసి ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ, మేయర్ అముద, చుడా ఛైర్‌పర్సన్ హేమలత

మత్తుకు బలికావద్దు

● చిత్తూరులో యాంటీ డ్రగ్స్ ర్యాలీ

- వివరాలు 7లో

జడ్పీలో కారుణ్య నియామకాలు

నలుగురికి జూనియర్ అసిస్టెంట్లుగా ఉద్యోగాలు

చిత్తూరు రూరల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ (జడ్పీ)లో కారుణ్య నియమకాల ద్వారా నలుగురికి జూనియర్ అసిస్టెంట్లుగా ఉద్యోగాలు ఇచ్చినట్లు సీఈవో రవికుమార్‌నాయుడు తెలిపారు. గురువారం తన చాంబర్‌లో సాయికార్తిక్, వినయ్‌కృష్ణ, గణేష్ కుమార్, అభిలేష్‌లకు నియామక పత్రాలు అందజేశారు.

నలుగురు రికార్డు అసిస్టెంట్లకు జేఏలుగా పదోన్నతి: జడ్పీ పరిధిలో నలుగురు రికార్డు అసిస్టెంట్లకు జూనియన్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పిస్తూ సీఈవో ఉత్తర్వులు జారీచేశారు. పదోన్నతి పొందినవారిలో.. సుభాషిణి, గీత, శ్రీదేవి, ద్రాక్షాయణి ఉన్నారు.

13 మండలాల్లో వర్షం

చిత్తూరు సెంట్రల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా 13 మండలాల్లో వర్షం కురిసింది. బుధవారం ఉదయం ఎనిమిది నుంచి గురువారం ఉదయం ఎనిమిది గంటల వరకు నమోదైన వర్షపాత వివరాలు ఇలా ఉన్నాయి. వెదురుకుప్పం మండలంలో అత్యధికంగా 12 మి.మీ వర్షపాతం నమోదైంది. మండలాల వారీగా.. పెనుమూరులో 11.4, పూతలపట్టు, పాలసముద్రం, ఐరాలలో 8.4, పుంగనూరులో 7.2, చౌడేపల్లెలో 7, జీడీ నెల్లూరులో 6, పులిచెర్లలో 4.4, నగరిలో 4.2, ఎస్ఆర్‌పురం, పలమనేరులో 2.8, కార్వేటినగరంలో 1.8 మి.మీ వర్షం కురిసింది.

ఒంటరి ఏనుగు హల్‌చల్

దాడినుంచి త్రుటిలో తప్పించుకున్న దంపతులు

భయాందోళనలో అటవీప్రాంత జనం

రామకుప్పం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండల అటవీప్రాంత జనానికి మూడ్రోజులుగా ఒంటరి ఏనుగు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. కొన్ని నెలలుగా ననియాల అటవీ లోతట్టు ప్రాంతంలో మకాం వేసిన ఈ ఏనుగు.. తోటలు, పొలాలపై దాడులు చేస్తూ భయాందోళనలకు గురిచేస్తోంది. గిట్టుబాటు ధరలేక మామిడి కాయలను చెట్లలోనే వదిలేస్తున్నారు. మాగిన కాయలు నేలరాలిపోతున్నాయి. ఈ పండ్ల వాసన పసిగట్టిన ఒంటరి ఏనుగు.. ననియాల, ఎస్.గొల్లపల్లె తదితర గ్రామాల సమీప తోటలు, పొలాలపై పడుతోంది. నేలరాలిన పండ్లను తింటూ, కాయల్ని నేలరాలుస్తోంది. కొమ్మలు విరిచేస్తోంది. ననియాలకు చెందిన చంద్రమోహన్ దంపతులు తమ పొలంలోని టమోటాలను కోసి సోమవారం రాత్రి అక్కడే ఉన్న షెడ్‌లో ఉంచి.. కాపలా ఉన్నారు. మంగళవారం తెల్లవారు జామున మూడు గంటల ప్రాంతంలో ఒంటరి ఏనుగు వీరి పొలం వద్దకొచ్చింది. ఆ సమయంలో బహిర్భూమికని షెడ్ బయటకు వచ్చిన చంద్రమోహన్ భార్యను చూసి.. ఆమెవైపు వచ్చింది. దూరంనుంచే గమనించిన ఆమె పరుగున గ్రామానికి చేరుకుంది. షెడ్‌లోని చంద్రమోహన్ మాత్రం భయాందోళనతో అక్కడే నక్కి ఉండిపోయాడు. షెడ్ గోడను పాక్షికంగా కూల్చివేసిన ఏనుగు అక్కడినుంచి వెళ్లిపోవడంతో ఆయన తప్పించుకున్నాడు. బుధవారం రాత్రి తిరిగి గ్రామ సమీప పొలాలు, తోటలపై దాడి చేసింది. శంకరప్ప, నాగరాజు, బెంగుళూరుప్పలకు చెందిన మామిడి తోటలు, వరి పొలాలపై పడింది. మామిడి చెట్ల కొమ్మలను విరిచేసింది. వరి పైరునూ తొక్కేసింది. ఈ ఏనుగును అటవీ లోతట్టు ప్రాంతం వైపు మళ్లించడానికి అటవీ అధికారులు, ట్రాకర్లు అష్టకష్టాలు పడాల్సి వస్తోంది. ఒక్కోసారి వారిపై తిరగబడుతోంది. బాణసంచా పేల్చినా జంకడం లేదని ననియాల అటవీ విభాగాధికారి హరికుమార్ తెలిపారు. ఏనుగును రెచ్చగొట్టే ప్రయత్నం చేయొద్దని రైతులకు సూచించారు. రాత్రివేళల్లో పొలాల వద్దకు వెళ్లొద్దని ఆయన చెప్పారు.



ఏనుగు తొక్కేసిన వరి పంటను పరిశీలిస్తున్న అటవీ అధికారి



పాక్షికంగా ధ్వంసమైన షెడ్ గోడ







ఆలయం ముందు రఘు - బండ్ల గణేష్

ప్రసాదాలు బావున్నాయి

● ప్లీజ్.. ఇలానే కంటిన్యూ చేయండన్న నటుడు రఘు

తిరుమల, జూన్26(ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చే భక్తులకు టీటీడీ అందిస్తున్న సౌకర్యాలు బావున్నాయని సినీనటుడు రఘు సంతృప్తి వ్యక్తం చేశారు. తిరుమల శ్రీవారిని గురువారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ, తిరుమలలో గతానికి ఇప్పటికి చాలా మార్పులు వచ్చాయన్నారు. అనేక చోట్ల కియోస్క్ యంత్రాలు ఏర్పాటు చేసి సేవలు అందించడం బావుందన్నారు. 'ప్రసాదాల రుచి బావుంది. ప్లీజ్ .. ఇలానే కంటిన్యూ చేయండి' అని అన్నారు. అలాగే 'కోర్టు' సినిమాతో హీరోయిన్‌గా పరిచయమైన శ్రీదేవి, నిర్మాత బండ్ల గణేష్ కూడా గురువారం శ్రీవారిని దర్శించుకున్నారు. ఇంకా ఉత్తరాఖండ్ మాజీ సీఎం త్రివేంద్ర సింగ్ రావత్, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు, ఎమ్మెల్యేలు సుజనా చౌదరి, మాధవి రెడ్డి, పులివర్తి నాని కూడా గురువారం స్వామిని దర్శించుకున్నవారిలో ఉన్నారు.

హైదరాబాదు- కన్యాకుమారి మధ్య 8 ప్రత్యేక రైళ్లు

తిరుపతి(సెంట్రల్), జూన్26(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని హైదరాబాదు-కన్యాకుమారి మధ్య తిరువణ్ణామలై మీదుగా 8 ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్టు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. తిరువణ్ణామలై పుణ్యక్షేత్రానికి పెరుగుతున్న రద్దీని తెలుసుకొని వీటిని ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. జూలై 2 నుంచి 25వ తేది వరకు రాక పోకలు సాగిస్తాయన్నారు. హైదరాబాదులో ఈ ప్రత్యేక రైలు(07230) జూలై 2న (బుధవారం) సాయంత్రం 5.20 గంటలకు బయలుదేరి సికింద్రాబాదు, నల్లగొండ, నడికుడి, గుంటూరు, గూడూరు, రేణిగుంట, తిరుపతి, పాకాల, చిత్తూరు, కాట్పాడి, తిరువణ్ణామలై మీదుగా కన్యాకుమారికి 3వ తేది అర్ధరాత్రి దాటాక 2.30 గంటలకు చేరుకొంటుందని తెలిపారు. 4వ తేది (శుక్రవారం) ఉదయం 5.15 గంటలకు ఈ ప్రత్యేక రైలు(07229) బయలుదేరి వచ్చిన మార్గంలో ప్రయాణిస్తూ 5వ తేది మధ్యాహ్నం 2.30 గంటలకు హైదరాబాదు చేరుకొంటుందన్నారు.

సర్వదర్శనానికి 10 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 30 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం హుండీ ఆదాయం: రూ.3.67 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 75,001

తలనీలాలు సమర్పించినవారు: 23,765

దృష్టి సారిస్తే ఈ తీరాలు మణిహారాలు

ఎగసిపడే అలలు.. లయబద్ధంగా వినిపించే తరంగాల హోరు.. విశాలంగా పరచుకున్న ఇసుక తిన్నెలు.. నీలాకాశ అంచుల్ని ముద్దాడుతున్నట్లు కనిపించే సముద్రం సందర్శకులను కట్టిపడేస్తాయి. మనసు దోచుకునే ఈ ప్రకృతి రమణీయ తీరాలు చేరువలోనే ఉన్నాయి. అయితే ఆలనాపాలనా లేక ఆదరణకు దూరమవుతున్నాయి. పర్యాటకంగా అభివృద్ధి చేస్తే ప్రముఖ బీచ్‌ల సరసన చేరే సత్తా ఈ సుమనోహర తీరాలకుంది.

\- గూడూరు, (ఆంధ్రజ్యోతి)

ఈ బీచ్‌లకు ఎలా వెళ్లాలంటే....

గూడూరు నుంచి గుమ్మళ్లదిబ్బకు 38 కిలోమీటర్లు దూరం. ఆర్టీసీబస్సు సౌకర్యం ఉంది. గ్రామం నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో బీచ్ ఉంటుంది. నెల్లూరు నుంచి ముత్తుకూరు మీదుగా పోర్టురోడ్డు గుండా సుమారు 48 కిలోమీటర్లు ఉంటుంది. కోట నుంచి సుమారు 30 కిలోమీటర్లలోపే దూరం ఉంటుంది. నెల్లూరు, గూడూరు, కోట ప్రాంతాల నుంచి ఆర్టీసీ బస్సు సౌకర్యముంది. తీగపాళెం బీచ్‌కు వెళ్లాలంటే లింగవరం నుంచి లేదా, గుమ్మళదిబ్బ నుంచి వెళ్లాలి. అయితే రెండు కిలోమీటర్ల మేర గ్రావెల్‌రోడ్డులో వెళ్లాలి. తారు రోడ్డు సౌకర్యం లేక చాలామంది వెనుకడుగేస్తున్నారు.

పర్యాటకాభివృద్ధితో ఉపాధికి ఊతం

ఇక్కడి బీచ్‌లను పర్యాటకంగా అభివృద్ధి చేస్తే స్థానిక మత్స్యకారులకు జీవనోపాధి మెరుగుపడుతుంది. వివిధ రూపాల్లో ఇతరులకూ ఉపాధి కలుగుతుంది. రాష్ట్రానికి కొంత ఆదాయమూ సమకూరుతుంది. క్రిస్‌సిటీ నేపథ్యంలో ఇక్కడి బీచ్‌లపై పర్యాటకశాఖ ఫోకస్ పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.



తీగపాళెం తీరంలో సందర్శకుల సందడి



తీగపాళెం బీచ్‌కు ఈ ఇరుకుదారే ఆధారం



తీగపాళెంలో పర్యాటకాభివృద్ధిపై పరిశీలిస్తున్న అధికారులు(ఫైల్‌ఫొటో)

● సహజ అందాలకు నెలవు గుమ్మళ్లదిబ్బ, తీగపాళెం బీచ్‌లు



గుమ్మళ్లదిబ్బ తీరంలో సోయగాలు

సహజ సౌందర్యానికి కేరాఫ్‌గా నిలుస్తాయి చిల్లకూరు మండలం గుమ్మళ్లదిబ్బ, తీగపాళెం గ్రామాల బీచ్‌లు. ఫోకస్ లేక వీటి ఉనికి అంతంతమాత్రమైంది. సాధారణంగా సాగర తీరం అభివృద్ధి చేస్తే పర్యాటకంగానే కాదు.. ఎన్నో అంశాలనూ ఇది ప్రభావితం చేస్తుంది. గుజరాత్ తీరం ఆధారంగానే అభివృద్ధి సాధించింది. పాండిచ్చేరి, చెన్నై, గోవా, కేరళలోనూ బీచ్‌లను పర్యాటకంగా తీర్చిదిద్దుతున్నారు. గుమ్మళ్లదిబ్బ, తీగపాళెం బీచ్‌లను కూడా ఇదే తరహాలో అభివృద్ధి చేస్తే సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటాయి.



గుమ్మళ్లదిబ్బ తీరప్రాంతంలో ఆలీవ్‌రిడ్లే తాబేళ్ల సంరక్షణ కేంద్రం

పరిశీలనే తప్ప పురోగతి ఏది?

గుమ్మళ్లదిబ్బ బీచ్‌లో ఆలీవ్‌రిడ్లే తాబేళ్ల సంరక్షణ కేంద్రముంది. కృష్ణపట్నం పోర్టు నుంచి ఇక్కడికి ఆరు కిలోమీటర్ల దూరం. తీగపాళెం బీచ్ 9 కిలోమీటర్ల దూరం. సమీపాన తూర్పుకనుపూరులోని ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు వస్తుంటారు. తూర్పుకనుపూరు నుంచి ఈ బీచ్‌లకు 15 కిలోమీటర్ల దూరమే. పోర్టు సందర్శకులు, అమ్మవారి భక్తులకు మానసిక ఉల్లాసాన్ని పంచేందుకు ఈ రెండు బీచ్‌లు దోహదపడతాయి. వేసవి నెలల్లో కుటుంబసమేతంగా వచ్చి సేద తీరవచ్చు. ప్రీవెడ్డింగ్ షూటింగ్‌లకు కొందరు ఈమధ్య ఆసక్తి చూపుతున్నారు. 10 నెలల క్రితం పర్యాటకంగా ఈ రెండింటినీ అభివృద్ధి చేసేందుకు పర్యాటకశాఖ, రెవెన్యూశాఖ అధికారులు పరిశీలించారు. ఇప్పటివరకు ఆదిశగా ఎటువంటి చర్యలూ ప్రారంభం కాలేదు.

తిరుమలలో బిహారీలు

● బాలాజీనగర్‌లో నివాసం

● భద్రతా తనిఖీల్లో గుర్తించిన పోలీసులు



ఇతర రాష్ట్రాలకు చెందిన వారి వివరాలు నమోదు చేస్తున్న పోలీసులు

తిరుమల, జూన్ 26 (ఆంధ్రజ్యోతి):తిరుమల కొండపై ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యక్తులు చాలా మంది నివాసం ఉంటున్నట్టు టీటీడీ గుర్తించింది. తిరుమలలో భద్రతను మరింత కట్టుదిట్టం చేసే చర్యల్లో భాగంగా చేపడుతున్న తనిఖీల్లో ఈ విషయం బయటపడింది. వీరిలో అత్యధికంగా బీహార్‌వాసులున్నట్టు గుర్తించారు. స్థానికులు నివసించే బాలాజీనగర్‌లో బీహార్, ఉత్తరప్రదేశ్, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలకు చెందినవారు ఉన్నట్టు వెల్లడైంది. వీరంతా హోటల్ కార్మికులు. తిరుమలలోని ప్రయివేటు హోటల్ యజమానులు బాలాజీనగర్‌లోని ఇళ్లను అద్దెకు తీసుకుని వీరికి కేటాయిస్తున్నారు. వీరి ఆధార్, ఇతర గుర్తింపు పత్రాలను తిరుమల పోలీసులు సేకరిస్తున్నారు. అలాగే ఎలాంటి గుర్తింపు లేకుండా తిరుమలలో షెడ్లు ఏర్పాటు చేసుకుని నివాసముంటున్న వారిని గుర్తించి తిరుపతికి తరలిస్తున్నారు. ఈ షెడ్లను తొలగిస్తున్నారు.

భక్తుల బ్యాగ్ భద్రంగా..



బ్యాగులోని బంగారు తాళిబొట్టు చైన్‌ను అందజేస్తున్న పోలీసులు

తిరుమల, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): అలిపిరి స్కానింగ్ కేంద్రంలో మర్చిపోయిన బ్యాగును తిరుమల పోలీసులు భక్తులకు తిరిగి అప్పగించారు. హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ శ్రీధర్ బోపన్న, డాక్టర్ ప్రజ్ఞశ్రీ దంపతులు కుటుంబతో కలిసి బుధవారం ఉదయం కాలినడకన తిరుమలకు చేరుకునేందుకు అలిపిరికి చేరుకున్నారు. అక్కడ బ్యాగుల స్కానింగ్ కేంద్రంలో 80 గ్రాముల బంగారు తాళిబొట్టు గొలుసున్న బ్యాగును మరచిపోయారు. ఆయన తిరుమల పోలీసులను ఆశ్రయించగా కమాండ్ కంట్రోల్ రూమ్‌లోని సీసీ కెమెరాలను పరిశీలించారు. దీంతో ఆ బ్యాగు పొరపాటున మరో భక్తుడి లగేజీలో చేరినట్టు గుర్తించారు. వెంటనే ఆభక్తుడిని సంప్రదించి బ్యాగును స్వాధన పరుచుకుని శ్రీధర్ బోపన్నకు బ్యాగును అందజేశారు. నాలుగు గంటల వ్యవధిలోనే బ్యాగును గుర్తించి తిరిగి భక్తులకు అందజేసిన తిరుమల సీఐ శ్రీరాముడు, ఎస్ఐలు లక్ష్మణ్, చలపతిలను ఎస్పీ హర్షవర్ధన్‌రాజు అభినందించారు.

ఆరుగురు 'ఎర్ర' స్మగర్లకు ఆరేళ్ల జైలు

● రూ.ఆరు లక్షల చొప్పున జరిమానా

తిరుపతి(నేరవిభాగం), జూన్ 26(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో ఆరుగురు స్మగర్లకు ఆరేళ్ల జైలు శిక్షతో పాటు రూ.ఆరు లక్షలు చొప్పున జరిమానా విధిస్తూ గురువారం ఎర్రచందనం స్పెషల్ కోర్టు ఏడీజే న్యాయమూర్తి నరసింహమూర్తి తీర్పు చెప్పారు. తిరుపతి టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాసులు కథనం మేరకు.. ఎనిమిదేళ్ళ క్రితం కరకంబాడి ఫారెస్టు బీటు టీఎన్ పాలెం సెక్షన్, తిరుపతి రేంజ్ పరిధిలో జిల్లాకు చెందిన చాంద్‌బాషా, అవినాష్, నాగరాజు, ధనశేఖర్, వరదరాజులు, ఎం.నాగరాజు ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తున్నారు. దీనిపై ముందుగా అందిన సమాచారం మేరకు అప్పటి టాస్క్‌ఫోర్సు అధికారులు వీరిని పట్టుకుని అరెస్టు చేశారు. అప్పట్లో వీరు బెయిల్‌పై బయటకు వచ్చారు. ఇదే కేసు మళ్లీ తిరుపతి ఎర్రచందనం స్పెషల్ కోర్టుకు కేసు పూర్వాపరాలను టాస్క్‌ఫోర్సు పోలీసులు అందించారు. ఈ క్రమంలో నేరం చేశారని రుజువు కావడంతో ఆ ఆరుగురు స్మగ్లర్లకు న్యాయమూర్తి ఆరేళ్ల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికీ రూ.ఆరు లక్షలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.న్యాయమూర్తి ఆదేశాల మేరకు నిందితులను నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించారు.

మత్తు వీడండి.. జీవితాన్ని గెలవండి

● యాంటీ డ్రగ్స్ ర్యాలీలో కలెక్టర్, ఎస్పీ పిలుపు



ఎంఆర్‌పల్లె సర్కిల్ వద్ద జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(నేరవిభాగం), జూన్ 26(ఆంధ్రజ్యోతి): 'ఇటీవల యువత డ్రగ్స్ బారిన పడుతున్నారు. ఆ మత్తులో ఇతర నేరాలకు.. మహిళల మీద అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. మరోవైపు వారి ఆరోగ్యమూ క్షీణిస్తోంది. అందుకని ప్రతి ఒక్కరిలో చైతన్యం రావాలి. యువత కూడా మత్తు వీడటం ద్వారా జీవితాన్ని గెలవచ్చు' అని కలెక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినం సందర్భంగా గురువారం తిరుపతిలో ఆర్డీవో కార్యాలయం నుంచి ఎంఆర్‌పల్లె సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గంజాయి, డ్రగ్స్ నుంచి రాష్ట్రాన్ని విముక్తి చేయాలనే దృఢ సంకల్పంతో సీఎం చంద్రబాబు ఉన్నారన్నారు. కొంతమంది యువకులను డ్రగ్స్ గంజాయి అనే మత్తు పదార్థాలు పట్టిపీడిస్తున్నాయని ఎస్పీ హర్షవర్ధనరాజు ఆందోళన వ్యక్తంచేశారు. అలాంటి యువతను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. మన స్నేహితులు మాదక ద్రవ్యాలు తీసుకుంటుంటే మౌనంగా ఉండటం మంచిది కాదన్నారు. ఎవరైనా గంజాయి, డ్రగ్స్ తీసుకుంటున్నట్లు మీ దృష్టికి వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. అప్పుడే ఈ మహమ్మారిని నివారించగలమన్నారు. 'డ్రగ్స్ ప్రభావం సమాజం మీద ఎలా ఉంటుంది? దీని నిర్మూలనకు ఎలా కృషి చేయాలనే దానిపై పాఠశాల, కళాశాలల్లో ఇతర శాఖల సమన్వయంతో మేము ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నాం' అని ఎస్పీ వివరించారు. పోలీసులకు సమాచారం ఇద్దాం.. డ్రగ్స్ నివారిద్దం నినాదంతో ముందుకెళదామని పిలుపునిచ్చారు. డ్రగ్స్ వద్దు..జీవితం ముద్దు అంటూ ర్యాలీలో విద్యార్థులు, యువత నినాదాలు చేశారు. ప్లకార్డులతో ప్రజల్లో అవగాహన కల్పించారు. అందరిచేత డ్రగ్స్ నియంత్రణ ప్రతిజ్ఞ చేయించారు. ఎంఆర్‌పల్లె సర్కిల్ వద్ద మానవహారంగా నిలబడ్డారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, రాష్ట్ర గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ సుగుణమ్మ, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, టీడీపీ నేత శ్రీనివాసులు, కూటమి నాయకులు, కార్పొరేషన్ కమిషనర్ మౌర్య, శ్రీపద్మావతి మహిళా వర్సిటీ వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజిని, అడిషనల్ ఎస్పీ రవిమనోహరాచారి, అదనపు కమిషనరు చరణ్‌తేజరెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. కాగా, డ్రగ్స్ అనర్థాలపై అవగాహన కల్పిస్తూ జిల్లా వ్యాప్తంగా పలువురు ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారుల ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్ ర్యాలీలు నిర్వహించారు.

ప్రాథమిక పాఠశాలకు తాళం

● విలీనంపై విద్యార్థుల నిరసన





బంగారమ్మ కండ్రిగ స్కూలు ఎదుట విద్యార్థులు, తల్లిదండ్రులు నిరసన - తాళం వేయడంతో బయట కూర్చున్న ఉపాధ్యాయుడు

కేవీబీపురం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): తమ ఊరి పాఠశాల తరగతులను మరో గ్రామ పాఠశాలలో విలీనం చేయవద్దంటూ కేవీబీపురం మండలం బంగారమ్మ కండ్రిగలోని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు గురువారం ఆందోళన చేశారు. ఇక్కడి ప్రాథమిక పాఠశాలలో 38 మంది విద్యార్థులున్నారు. ఇటీవల ఈ స్కూలును రెండున్నర కిలోమీటర్ల దూరంలోని ఎస్ఎన్ కండ్రిగ పాఠశాలలో విలీనం చేశారు. తమ పిల్లలు అంత దూరం వెళ్లి చదవడం కష్టంగా ఉంటుందంటూ తల్లిదండ్రులు తాళం వేశారు. చేసేదిలేక ఉపాధ్యాయుడు బయట కూర్చుని సమయం అయ్యాక వెళ్లిపోయారు.

రాజకీయ ముఖచిత్రం మారబోతోంది

● బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శంకరరావు



చైతన్య రథాలను ప్రారంభిస్తున్న బీసీ సంక్షేమ సంఘ నేతలు

తిరుపతి అర్బన్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): స్థానిక ఇందిరా మైదానంలో జూలై 6వ తేదీ జరగనున్న బీసీ ఆత్మగౌరవ సభతో రాజకీయ ముఖచిత్రం మారబోతోందని, రాష్ట్ర రాజకీయాల్లో పెనుమార్పులు రానున్నాయని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు అన్నారు. గురువారం ఉదయం ఆయన బాలాజీకాలనీలోని పూలే విగ్రహానికి పూలమాలలు వేసి, బీసీ ఆత్మగౌరవ సభ ప్రచార చైతన్య రథాలను జెండా ఊపి ప్రారంభించారు. ఆత్మగౌరవ సభతో బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని విశ్వసిస్తున్నానన్నారు. జిల్లా అధ్యక్షుడు నాగరాజగౌడ్ మాట్లాడుతూ సభను విజయవంతం చేయడంలో భాగంగా అన్ని జిల్లాల్లో పర్యటించేందుకు ప్రచార రథాలను ప్రారంభించినట్లు వివరించారు. టీడీపీ నేత మబ్బుదేవనారాయణరెడ్డి మాట్లాడుతూ బీసీలు ఐక్యంగా ఉండి సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. బీసీ సంఘం కన్వీనర్ ఆల్మన్‌రాజు, మాజీ మంత్రి పరసారత్నం మాట్లాడుతూ కులమతాలకతీతంగా సభకు ప్రజలు హాజరై విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ కులసంఘాల నేతలు పాల్గొన్నారు.

చంద్రగిరి హైవేలో లారీ హైజాక్

● రాజంపేట వద్ద పట్టుకున్న పోలీసులు

చంద్రగిరి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండల పరిధిలోని పూతలపట్టు- నాయుడుపేట జాతీయ రహదారిలో గురువారం సాయంత్రం లారీ హైజాక్ గురైంది. కర్ణాటక రాష్ట్రం బంగారుపేట నుంచి క్యాబేజీ, క్యాప్సికం లోడుతో లారీ రాజమండ్రికి బయలుదేరింది. గాదంకి టోల్ ప్లాజా వద్ద ఐదుగురు దుండగులు లారీని ఆపి, డ్రైవర్ చరణ్‌కుమార్‌పై దాడి చేసి తీసుకెళ్లారు. డ్రైవరు ఫిర్యాదుతో చంద్రగిరి సీఐ సుబ్బరామిరెడ్డి, ఎస్ఐ అనిత లారీ కోసం గాలించారు. పోలీసులు లారీని వెంబడించి, రాజంపేట సమీపంలో పట్టుకొన్నారు. ఐదుగురు దుండగులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

'ఆభ' కార్డుతో రోగి మెడికల్ హిస్టరీ అనుసంధానం

● జాయింట్ కమిషనర్ డాక్టర్ బీసీకే నాయక్



చంద్రగిరి సీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న కమిషనర్

చంద్రగిరి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ఆయుష్మాన్ భవ (ఆభ) కార్డుతో రోగి మెడికల్ హిస్టరీ అనుసంధానం చేయబడుతుందని ఏపీ వీవీపీ జాయింట్ కమిషనర్ విజలెన్స్ బీసీకే నాయక్ తెలిపారు. గురువారం చంద్రగిరిలోని సీహెచ్‌సీని ఆయన తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని వార్డులను, పరిసరాలను పరిశీలించారు. ప్రతి రోగి తమ వెంట ఆధార్‌తో పాటు ఆధార్‌కు లింక్ చేసిన మొబైల్ ఫోన్‌ను తీసుకురావాలన్నారు. ఆధార్ కార్డుతో 'ఆభ' కార్డు లింక్ చేయబడుతుందన్నారు. తద్వారా దేశంలో ఏ ఆస్పత్రికి వెళ్లినా రోగి మెడికల్ హిస్టరీ రికార్డు అందుబాటులోకి వస్తుందన్నారు. అత్యవసర పరిస్థితుల్లో మెడికల్ హిస్టరీ ద్వారా రోగి సకాలంలో మెరుగైన వైద్య చికిత్సలు అందించడానికి వీలు కలుగుతుందన్నారు. డీసీహెచ్ఎస్ డాక్టర్ ఆనందమూర్తి, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అరుణ, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్వీయూ పీజీ జవాబు పత్రాల మూల్యాంకనంపై ప్రత్యేక శ్రద్ధ

● పది రోజుల్లో పూర్తి చేసేందుకు కసరత్తు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూనివర్సిటీ పరిధిలో పీజీ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనంపై ఉన్నతాధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. మూల్యాంకనం ఆలస్యమైనట్టు అధికారులు గుర్తించారు. దీంతో పది రోజుల్లో పీజీ నాలుగు సెమిస్టర్ల జవాబు పత్రాల మూల్యాంకనం పూర్తి అయ్యేందుకు ప్రణాళిక రూపొందించారు. పీజీ 3, 4వ సెమిస్టర్ల మూల్యాంకనం ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ నెల 30వ తేదీ నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. పీజీ 1, 2వ సెమిస్టర్ల మూల్యాంకనం వచ్చే నెల 7 వ తేదీ నాటికి పూర్తి కావాల్సిందేనని స్పష్టం చేశారు. ఇకపై యూనివర్సిటీలోని కాలేజీల వారిగా మూల్యాంకనాన్ని పర్యవేక్షించేందుకు ప్రత్యేక అధికారులను నియమించే యోచనలో అధికారులు ఉన్నట్టు తెలుస్తోంది. ఈ మేరకు వర్సిటీ కాలేజీల ప్రిన్సిపాళ్ళకు వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మాదాల భూపతి నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు.

మామిడి సబ్సిడీపై రైతులకు అవగాహన కల్పించాలి

● కలెక్టర్ సుమిత్ కుమార్

చిత్తూరు సెంట్రల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీని సద్వినియోగం చేసుకునేలా మామిడి రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ నుంచి ఆర్డీవోలు, జిల్లా వ్యవసాయ, ఉద్యాన, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం మామిడికి ప్రకటించిన సబ్సిడీ రూ.4లు రైతులకు అందజేలా చూడాల్సిన బాధ్యత మండల అగ్రికల్చర్, హార్టికల్చర్, సెరికల్చర్ అసిస్టెంట్లు, తహసీల్దార్లపై ఉందన్నారు. గతంలో పలమనేరు, కుప్పం నియోజకవర్గాల్లోని 70వేల మెట్రిక్ టన్నుల మామిడి కాయలను వ్యాపారవేత్తలు తోటలవద్దే కొనుగోలు చేసేవారని, దిగుబడి పెరగడంతో ప్రస్తుతం అలాంటి పరిస్థితి లేదన్నారు. దాంతో మామిడి కాయలను ఫ్యాక్టరీలకు తేవడంలో రైతులు పోటెత్తుతున్నారని చెప్పారు. ర్యాంపుల వద్ద షిప్ట్ సిస్టమ్‌లో అధికారులు పనిచేసి, రైతుల వివరాలను నిర్దేశిత ప్రొఫార్మాలతో కలెక్టర్ కార్యాలయానికి పంపాలని సూచించారు. గుజ్జు పరిశ్రమలు, ర్యాంపులు, మండీలకు రైతులు తరలించిన కాయలను సైతం నమోదు చేయాలని ఆదేశాలిచ్చారు. రైతులు తోటల నుంచి నేరుగా వేరే రాష్ట్రాలకు సరఫరా చేసినా, వాటి వివరాలను రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకునేలా అధికారులు అవగాహన కల్పించాలన్నారు.

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పోరాటం

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శంకరరావు



నూతనంగా ఎన్నికైన కమిటీకి నియామక పత్రాలు అందజేస్తున్న కేశవరావు

చిత్తూరు సిటీ, జూన్ 26(ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి బీసీ సంక్షేమ సంఘం రాజీలేని పోరాటం చేస్తుందని రాష్ట్ర అధ్యక్షుడు కె.శంకరరావు అన్నారు. గురువారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. బీసీల ఉద్యమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తున్నానని చెప్పారు. ఏపీ బీసీ సంక్షేమ సంఘంలోని రాయలసీమ బీసీ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడిగా హరిప్రసాద్, ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా మేదర చంద్ర, చిత్తూరు నియోజకవర్గ అధ్యక్షుడిగా సెల్వకుమార్‌ను నియమించినట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా జనగణనతోపాటు కుల గణనను చేపట్టేలా కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని అన్నారు. రాజకీయాల్లో బీసీ మహిళలకు కేటాయించే రిజర్వేషన్లను కేంద్రం స్పష్టంగా పేర్కొనాలని డిమాండ్ చేశారు. కులగణన చేయడం ద్వారా అర్హులైన బీసీలందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని చెప్పారు. నేతలు జ్ఞాన జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

టీచర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

బైరెడ్డిపల్లె, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లె మండలంలోని కమ్మనపల్లె బాలికల గురుకుల పాఠశాలలో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులకు ఆసక్తి ఉన్న మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శోభ ఒక ప్రకటనలో తెలిపారు. హిందీ, ఇంగ్లిషు, గణితం, భౌతికశాస్త్రం సబ్జెక్టులను బోధించడానికి అర్హులైనవారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 87126 25057 నెంబరును సంప్రదించాలని కోరారు.

పీఎంజేడీవైపై అవగాహన కల్పించాలి : కలెక్టర్

చిత్తూరు సెంట్రల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి జన్‌ధన్ యోజన (పీఎంజేడీవై)పై గ్రామ స్థాయిలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. గురువారం క్యాంపు కార్యాలయం నుంచి పథకం అమలుపై అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. బ్యాంకు ఖాతాలు లేనివారికి అకౌంటు తెరిచేలా చూడాలన్నారు. డీఆర్‌డీఏ, పంచాయతీ శాఖలు బ్యాంకులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. డ్వామా, డీఆర్‌డీఏ పీడీలు రవికుమార్, శ్రీదేవి, ఎల్‌డీఎం హరీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాత్రికి రాత్రే స్థలం ఆక్రమణ

వైసీపీ సర్పంచి కుమారుడిపై అధికారులకు మహిళ ఫిర్యాదు



బంకు వద్ద బాధిత మహిళ

గంగవరం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రాత్రికి రాత్రే వైసీపీ సర్పంచ్ కుమారుడు తన స్థలాన్ని ఆక్రమించుకున్నాడని బాధిత మహిళ గురువారం గంగవరం రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలు తెలిపిన వివరాల మేరకు.. గంగవరం మండలంలోని కీలపట్ల క్రాస్‌లో కాపురం ఉంటున్న జి.గణపతి భార్య చంద్రమ్మకు గంగవరం రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 402లో 2.26 సెంట్ల సెటిల్‌మెంట్ భూమి ఉంది. ఆమె భర్తకు పిత్రార్జితంగా ఈ భూమి సంక్రమించింది. భర్త నుంచి ఆమె కుమారుడిపై దానతపత్రంగా రిజిస్ట్రేషన్ అయ్యింది. అయితే గ్రామంలో వారులేని సమయంలో బుధవారం రాత్రి వైసీపీకి చెందిన గంగవరం సర్పంచ్ చంద్రమ్మ కుమారుడు రెడ్డిప్రసాద్ మరికొంతమందిని తీసుకొచ్చి తమ స్థలాన్ని ఆక్రమించేశాడని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది. తమ స్థలం ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని గంగవరం డిప్యూటీ తహసీల్దార్ నరేంద్రకు గురువారం వినతిపత్రం అందించారు.

కరకమందలో డెంగ్యూ కేసు



కరకమందలో మందులను పిచికారీ చేయిస్తున్న వైద్య సిబ్బంది

సోమల, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): సోమల మండలంలోని కరకమందలో డెంగ్యూ కేసు నమోదు కావడంతో మండల అధికారులు ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. స్థానిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రాల్లో పరిసరాలను పరిశీలించి పారిశుధ్య చర్యలు చేపట్టారు. అలాగే గ్రామంలోని ఇంటింటికీ మలాథియాన్ పిచికారీ చేయించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పర్యవేక్షించారు. గ్రామంలో పేడదిబ్బలు లేకుండా చర్యలు చేపట్టారు. ఎంపీడీవో నారాయణ, ఈవోపీఆర్డీ లక్ష్మీదేవి, పంచాయతీ కార్యదర్శి దివ్య భారతి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

మద్యం రేపిన చిచ్చు

పురుగుల మందు తాగేసిన దంపతులు

భార్య మృతి, ప్రాణాలతో బయటపడ్డ భర్త



పల్లవి మృతదేహం

బంగారుపాళ్యం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మద్యం రేపిన చిచ్చులో భార్య మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పలమనేరు మండలం జగమర్ల గ్రామానికి చెందిన సుధాకర్, పల్లవి దంపతులు తమ ముగ్గురు పిల్లలతో బంగారుపాళ్యం మండలం నలగాంపల్లె సమీపంలో ఓ మామిడి తోటలో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈనెల 22వ తేదీన సుధాకర్ మద్యం తాగి ఇంటికి రావడంతో దంపతుల మధ్య గొడవ జరిగింది. మనస్తాపానికి గురైన భర్త పురుగుల మందు తాగేశాడు. గమనించిన పల్లవి కూడా పురుగుల మందు తాగేసింది. ఇద్దరినీ స్థానికులు బంగారుపాళ్యం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తర్వాత మెరుగైన వైద్యం కోసం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పల్లవి గురువారం ఉదయం మృతి చెందగా, సుధాకర్ ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మత్తుకు బలికావద్దు

● యాంటీ డ్రగ్స్ ర్యాలీలో కలెక్టర్, ఎస్పీ సూచన



ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ, మేయర్, చుడా చైర్‌పర్సన్ తదితరులు

చిత్తూరు అర్బన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మత్తుకు బలికావద్దని కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ సూచించారు. మాదక ద్రవ్యాల నివారణపై (యాంటీ డ్రగ్స్) ర్యాలీని గురువారం చిత్తూరు గాంధీ విగ్రహం వద్ద నుంచి దర్గా సర్కిల్ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. దేశంలో మాదక ద్రవ్యాల వినియోగం విపరీతంగా పెరిగిందన్నారు. వినియోగించేవారిలో యువత అధికంగా ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పోలీసు, సంబంధిత శాఖల ఆధ్వర్యంలో డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. రానున్న రోజుల్లో డ్రగ్స్‌ను అమ్మేవారిపై పీడీయాక్టును నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికే సరిహద్దు రాష్ట్రాల వద్ద చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి, ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. కలెక్టర్ మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాలను వినియోగించడం వల్ల జ్ఞాపకశక్తి తగ్గిపోవడంతోపాటు శారీరక రుగ్మతలు తలెత్తుతాయన్నారు. యువత, విద్యార్థులు మాదకద్రవ్యాల వినియోగానికి దూరంగా ఉండాలని చెప్పారు. చుట్టుపక్కల అలాంటి వారుంటే వారిని రిహాబిలేటేషన్‌కు తరలించడానికి సహకరించాలని కోరారు. మాదకద్రవ్యాల వినియోగంతో కలిగే అనర్థాలపై జిల్లాలోని కాలేజీలు, పాఠశాలలు, ప్రభుత్వ భవనాలు, బస్సులపై పోస్టర్లను అతికించి అవగాహన కల్పిస్తామన్నారు. ఎక్సైజ్ ఏఎస్పీ శ్రీనివాస్ మాట్లాడుతూ.. కాలేజీ లేదా పాఠశాలల్లో ఎవరైనా డ్రగ్స్‌ను వినియోగించినా, విక్రయించినా అలాంటి వారిపై 112 లేదా 1972 లేదా పోలీసు వాట్సాప్ నెంబరు 94409 00005కు సమాచారం ఇవ్వాలన్నారు. డీఎల్ఎస్ఏ కార్యదర్శి భారతి, మేయర్ అముద, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, జడ్పీ సీఈవో రవికుమార్, డీఎంహెచ్‌వో సుధారాణి, ఐసీడీఎస్ పీడీ వెంకటేశ్వరమ్మ, ఏఆర్ ఏఎస్పీ శివానంద కిశోర్, డీఎస్పీ సాయినాథ్, బీజేపీ నేత అట్లూరి శ్రీనివాసులు, సీఐలు, ఎస్‌ఐలు, సిబ్బంది, యువత, విద్యార్థులు పాల్గొన్నారు.

గుడుపల్లె మండలంలో వరుస చోరీలు

ద్రావిడ వీసీ, ఏపీఆర్వో, ఉపాధ్యాయులు బాధితులు ● పట్టపగలే భారీగా బంగారు, వెండి, నగదు అపహరణ



గుండ్లసాగరం వద్ద నరేష్ ఇంట్లో చెల్లాచెదురుగా పడేసిన దుస్తులు

కుప్పం/గుడుపల్లె 26 (ఆంధ్రజ్యోతి): గుడుపల్లె మండలంలో గురువారం పట్టపగలే జరిగిన వరుస చోరీలలో బంగారు, వెండి, నగదు భారీగా అపహరణకు గురైంది. మండలంలోని గుండ్ల సాగరం శివార్లలో ద్రావిడ విశ్వవిద్యాలయం ఏపీఆర్వో ఇంట్లోని పైభాగంలో వర్సిటీ ఇన్‌చార్జి వీసీ దొరస్వామి ఒంటరిగా అద్దెకు ఉన్నారు. కింది పోర్షన్లో ఏపీఆర్వో నరేష్ కుటుంబం ఉంది. ఈయన భార్య కూడా వర్సిటీలోనే అకడమిక్ కన్సల్టెంట్‌గా పనిచేస్తున్నారు. సాయంత్రం దంపతులు ఇద్దరూ విధులు ముగించుకుని ఇంటికి వచ్చేసరికి తలుపులకు వేసిన తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా బీరువా తెరచి, అందులోని దుస్తులు, ఇతర వస్తువులు చెల్లాచెదురుగా కనిపించాయి. బీరువా లాకర్లో దాచి ఉంచిన 220 గ్రాముల బంగారు ఆభరణాలు, 2కిలోల వెండి వస్తువులు, రూ.15వేల నగదు అపహరణకు గురైనట్లు బాధితులు తెలిపారు. పైపోర్షన్లో నివాసముంటున్న ఇన్‌చార్జి వీసీ దొరస్వామి ఇంట్లోనూ ఇదేరకంగా చోరీ జరిగింది. బీరువాలో దాచిన రూ.2లక్షల నగదు అపహరణకు గురైనట్లు స్థానికులు తెలిపారు. మరోవైపు శెట్టిపల్లె పంచాయతీ పరిధిలోని పీఎస్ వైద్య కళాశాల సమీపంలో నివాసముంటున్న ఉపాధ్యాయుడు రమేష్ ఇంట్లో కూడా 1.5 కిలోల వెండి, రూ.48వేల నగదు చోరీ జరిగినట్లు బాధితులు తెలిపారు. ఉపాధ్యాయులైన భార్యాభర్తలు పాఠశాలల నుంచి సాయంత్రం ఇంటికి తిరిగివచ్చేసరికి దొంగలుపడి వెండి, నగదు దోచుకుని వెళ్లారు. గుడుపల్లె పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి మృతి



ప్రకాష్ (ఫైల్ ఫొటో)

ఐరాల(కాణిపాకం), జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఐరాల మండలం మామిడిగుంటపల్లెకు చెందిన ప్రకాష్(42) గురువారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. కాణిపాకం పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జి ఎస్‌ఐ చిరంజీవి తెలిపిన మేరకు.. ప్రకాష్ కాణిపాకం ఆలయంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా పని చేస్తున్నారు. ఉదయం విధుల నిమిత్తం ద్విచక్ర వాహనంపై వెళుతుండగా పైపల్లె జడ్పీ హైస్కూల్ ఎదురుగా ఐరాలకు చెందిన ఓ కారు ఢీకొంది. అదే కారు ఎదురుగా వస్తున్న మరో ఆటోను ఢీకొట్టి పక్కన ఉన్న చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో ప్రకాష్ తీవ్రంగా గాయపడ్డారు. అలాగే ఐరాలకు చెందిన ఆటోడ్రైవర్ జబ్బీర్ కూడా గాయపడ్డాడు. ప్రకాష్‌ను చికిత్స కోసం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జి ఎస్‌ఐ తెలిపారు.

పాలిసెట్ వెబ్ కౌన్సెలింగ్‌కు 264 మంది హాజరు



ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో వెబ్‌కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

తిరుపతి(విద్య), జూన్ 26(ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాలకుగాను జిల్లాలో మూడు కేంద్రాల్లో ఆరో రోజైన గురువారం నిర్వహించిన వెబ్ కౌన్సెలింగ్‌కు 264 మంది హాజరయ్యారని జిల్లా కోఆర్డినేటర్, తిరుపతి ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ డాక్టర్ వై.ద్వారకానాథ్‌రెడ్డి తెలిపారు. 86,001 నుంచి 1,04,000 ర్యాంకుల వారికి కౌన్సెలింగ్ జరిగింది. ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో కళాశాలలో జరిగిన కౌన్సెలింగ్‌కు 201 మంది హాజరయ్యారు. సత్యవేడులో 10 మంది, గూడూరులో 53 మంది విద్యార్థులు కౌన్సెలింగ్‌కు హాజరై తమ సర్టిఫికెట్లను ధ్రువీకరించుకున్నారు. శుక్రవారం 1,04,001 నుంచి 1,20,000 ర్యాంకుల వారికి కౌన్సెలింగ్ జరగనుంది.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

విజయపురం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి):విజయపురం మండలంలోని పాతార్కాడు సమీపంలో తమిళనాడు అరుంబాక్కానికి చెందిన వెంకటేశ్వరన్ హత్య కేసులో నిందితుడు వెంకటేశన్(57)ను గురువారం అరెస్టు చేసినట్టు సీఐ భాస్కర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. ఆస్తి విషయమై జరిగిన గొడవలతో ఈనెల 23న మధ్యాహ్నం 3గంటల సమయంలో పాతార్కాడు-ఇళ్లత్తూరు మార్గమధ్యంలో రాజు కొబ్బరితోట వద్ద హత్య చేసినట్టు గుర్తించామన్నారు. నిందితుడు ఉపయోగించిన కత్తిని, దుస్తులను స్వాధీనం చేసుకుని, అతడిని నగరి డీఎస్పీ అజీజ్ సమక్షంలో హాజరుపరచి రిమాండ్‌కు తరలించినట్టు వివరించారు. నిందితుడిని పట్టుకున్న ఎస్‌ఐ రంగా, ఏఎస్‌ఐ గోవిందరాజులు, సిబ్బంది సుబ్రహ్మణ్యం, నరేష్, సత్యరాజ్, మలనవాలన్, శశికుమార్, అయ్యప్ప, దామోదరం, హరిప్రసాద్, లక్ష్మయ్యను డీఎస్పీ అభినందించారు.

రూ.కోటి కొట్టేశారు

● రూ.2వేల నోట్ల మార్పిడి ముసుగులో భారీ మోసం

● కేసును ఛేదించి.. నలుగురిని అరెస్టు చేసిన పోలీసులు

● రూ.73.20 లక్షల నగదు, వాహనాల సీజ్



స్వాధీనం చేసుకున్న నగదును పరిశీలిస్తున్న ఎస్పీ హర్షవర్ధనరాజు

తిరుపతి(నేరవిభాగం), జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రూ.రెండు వేల నోట్లు చెలామణిలో లేవు. తగు ఆధారాలు చూపి రిజర్వు బ్యాంకులో మార్చుకోవచ్చు. ఈ వెసులుబాటునే కొందరు తమ మోసానికి అస్త్రంగా వాడుకున్నారు. తమ వద్ద ఎక్కువ మొత్తంలో రూ.రెండు వేల నోట్లున్నాయని నమ్మించారు. తమకు రూ.500 నోట్లతో రూ.కోటి ఇస్తే.. రూ.రెండు వేల నోట్లు రూ.2.5 కోట్లకు ఇస్తామని మైండ్‌గేమ్ ఆడారు. అలా సూళ్లూరుపేటలో ఒకరిని నమ్మించి.. అతడికి రూ.2 వేల నోట్లు ఇవ్వకనే రూ.కోటి కొట్టేశారు. ఈ కేసును పోలీసులు ఛేదించి నలుగురు నిందితులను అరెస్టు చేశారు. ఈ వివరాలను ఎస్పీ హర్షవర్ధనరాజు గురువారం తిరుపతిలో మీడియాకు వెల్లడించారు.

శ్రీకాకుళం జిల్లా కాశిబుగ్గకు చెందిన అంబటి సంతోష్ అలియాస్ చిన్నస్వామి, ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లాకు చెందిన బర్రి రవితేజ, తిరుపతికి చెందిన కె.హేమకర్‌రావు, విశాఖపట్నంలోని కంచర్లపాలెంకు చెందిన మామిడి ఉమామహేష్ ముఠాగా ఏర్పడ్డారు. వీరు పలువురిని కలుస్తూ తమ వద్దనున్న రూ.రెండు వేల నోట్ల కట్టను చూపుతారు. రూ.లక్షకు రూ.500 నోట్లు ఇస్తే రూ.రెండు లక్షలకు సంబంధించి రెండువేల నోట్లు ఇస్తామని, మీకు రిజర్వు బ్యాంకులో ఎవరైనా తెలిసుంటే మార్చుకోవచ్చని చెబుతారు. ఎవరైనా వీరి మాయలో పడితే డబ్బు తీసుకుని, రూ.రెండు వేల నోట్లు ఇవ్వకుండా పారిపోతారు. ఇలా గత నెలలో సూళ్లూరుపేటలో పలువురిని కలిసి 'డీల్' మాట్లాడారు. ఈ క్రమంలో మినీ ఏటీఎం నిర్వాహకుడు జగదీష్ వీరి వలలో పడ్డారు. రూ.కోటి ఇస్తే తాము రూ.రెండున్నర కోట్లకు రూ.రెండు వేల నోట్లు ఇస్తామని అతడిని వీరు నమ్మించారు. దీంతో అతడు రూ.కోటి సిద్ధం చేసుకున్నారు. గతనెల 7వ తేదీ ఈ నిందితులు వాహనాల్లో సూళ్లూరుపేటకు చేరుకుని సమీపంలోని హైవే వద్దకు రమ్మని జగదీష్‌కు చెప్పారు. అతడు రూ.కోటి బ్యాగుతో ఇద్దరు స్నేహితులతో కలిసి అక్కడికి వెళ్లారు. జగదీష్‌తో ఉన్న ఇద్దరిని దగ్గరలో వున్న తమ గదికి వెళితే బాస్ (అంబటి సంతోష్) రూ.రెండువేల నోట్లు రూ.2.50 కోట్లు ఇస్తారని చెప్పి పంపారు. అనంతరం జగదీష్ వద్ద ఉన్న రూ.కోటి బ్యాగును అంబటి సంతోష్ పీఏనని చెప్పిన వ్యక్తి తీసుకుని కారులో పారిపోతుండగా, జగదీష్ అప్రమత్తమై ఆ కారు డోరును పట్టుకున్నారు. కారులోని నిందితులు అతడిని కిందకు నెట్టేసి పరారయ్యారు. మిగిలిన వారూ మరో రెండు వాహనాల్లో పలాయనం చిత్తగించారు. దీనిపై బాధితుడి ఫిర్యాదు మేరకు డీఎస్పీ చెంచుబాబుకు విషయం తెలిపి సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ కేసు నమోదు చేశారు. నిందితుల ఆచూకీ కోసం పలు కోణాల్లో దర్యాప్తు చేశారు.

అందరూ పాత నేరస్థులే

నాయుడుపేట పోలీసులు అరెస్టు చేసిన నలుగురు నిందితులూ పాత నేరస్థులుగా గుర్తించారు. వీరిలో అంబటి సంతోష్‌పై కాశీబుగ్గ పోలీసు స్టేషన్‌లో 32వ రౌడీషీటర్‌గా, అలిపిరి, అనకాపల్లి, మాల్కాపురం, కాశీబుగ్గ స్టేషన్‌లలో ఐదు కేసులు నమోదై ఉన్నాయి. తిరుపతి మారుతీనగర్‌కు చెందిన హేమకర్‌పై కాణిపాకం స్టేషన్‌లో చీటింగ్ కేసు, బర్రి రవితేజ, మామిడి ఉమా మహేష్‌పై దాదాపు ఆరు కేసులున్నట్లు తెలిసింది.

వేలిముద్రలే పట్టిచ్చాయా?

ఎస్పీ హర్షవర్ధనరాజు ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ రవిమనోహరాచ్చారి పర్యవేక్షణలో డీఎస్పీ చెంచుబాబు, సీఐ మురళీకృష్ణ, ఎస్‌ఐ బ్రహ్మనాయుడు, డీవీ సత్రం ఎస్‌ఐ అజయ్‌బాబు, తడ ఎస్‌ఐ కొండమనాయుడు, ఏఎస్‌ఐలు, పోలీసులు బృందాలుగా విడిపోయారు. నిందితుల కదలికలు, గతంలో వారు ఎక్కడైనా నేరాలకు పాల్పడ్డారా? ఇలాంటి నేరాలు ఎక్కడ జరిగాయి? అనే కోణాల్లో సాంకేతిక ఆధారాలతో దర్యాప్తు చేశారు. మొదట ఈ కేసులో కీలక నిందితుడు అంబటి సంతోష్ వేలిముద్రలు పరిశీలించారు. ఇవి సరిపోవడంతో అతడి కోసం గాలించారు. వారి కదలికలపై దృష్టి సారించిన పోలీసులు అంబటి సంతోష్, బర్రి రవితేజ, ఉమామహేష్‌ను చిల్లకూరు మండలం బూదనం టోల్‌ప్లాజా వద్ద, కె.హేమకర్‌రావును తిరుపతిలో అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.73.20 లక్షల నగదు, రెండు వాహనాలు, ఆరు రూ.2000 నోట్ల డమ్మీ కట్టలు, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఇదే కేసులో దొంతిరెడ్డి హరిబాబు రెడ్డి పరారీలో ఉన్నాడు. ఈ కేసును ఛేదించడంలో విశేష ప్రతిభ చూపిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించి నగదు రివార్డులు అందచేశారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీలు వెంకట్రావు, రవిమనోహరాచ్చారి, డీఎస్పీ పాల్గొన్నారు.

వైసీపీకి ప్రజలు.. ప్రతిపక్ష హోదా ఇవ్వలేదు

● టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్ర కుమార్



మీడియాతో మాట్లాడుతున్న సురేంద్ర కుమార్

చిత్తూరు సిటీ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): వైసీపీకి ప్రజలు ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వలేదన్న విషయాన్ని ఆ పార్టీ నేతలు గుర్తించాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్ర కుమార్ అన్నారు. గురువారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రతిపక్ష నేతకు భద్రత కల్పించలేదంటూ మాజీ మంత్రి రోజా ఆరోపణలు చేయడం సరికాదన్నారు. భద్రతపై ఆందోళన ఉంటే పోలీసుల సూచనల మేరకు నడుచుకోవాలని హితవు పలికారు. అసత్య ఆరోపణలకు, పచ్చి అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్ మాజీ సీఎం జగన్ అని అన్నారు. ఇష్టానుసారంగా నడుస్తాను.. ప్రజలను తొక్కుకుంటూ పోతాను.. పోలీసులు చెప్పినా వినను.. అనే తీరుతో జగన్ ప్రవర్తించడం అతడి అహంకారానికి నిదర్శనమని చెప్పారు. సత్తెనపల్లి పర్యటనకు జిల్లా ఎస్పీ కేవలం వంద మందికి, మూడు వాహనాలకు అనుమతిస్తే ఆ నిబంధనలను ఎందుకు అతిక్రమించారో చెప్పాలన్నారు. జగన్‌ది పరామర్శ పర్యటనా.. లేక బల ప్రదర్శన కోసం ప్రణాళికా బద్ధంగా చేసిన పర్యటనా అని ప్రశ్నించారు. జగన్ నిర్లక్ష్య ధోరణితో అమాయకులైన ముగ్గురు ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. అయినా జగన్‌లో పశ్చాత్తాపం లేకపోవడం బాధాకరమని అన్నారు. ప్రజలు ఇప్పటికే జగన్ రాజకీయాలకు పనికి రారని తేల్చేశారన్నారు. కార్యక్రమంలో టీడీడీ జిల్లా కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు బైక్ దొంగల అరెస్టు

● 8 వాహనాల స్వాధీనం



నిందితుల వివరాలు తెలియజేస్తున్న పోలీసులు, స్వాధీనం చేసుకున్న బైకులు

నగరి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు బైక్ దొంగలను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి ఎనిమిది వాహనాలను స్వాధీనం చేసకున్నారు. డీఎస్పీ అజీజ్ గురువారం మీడియాకు వివరాలు తెలిపారు. నగరి పరిసర ప్రాంతాల్లో నాలుగు నెలలుగా బైక్‌లు చోరీకి గురయ్యాయని ఫిర్యాదులు అందాయి. దీంతో తమిళనాడు సరిహద్దులో సీసీ కెమెరాలు పెట్టి, పాత నేరస్తులపై నిఘా ఉంచారు. ఈ క్రమంలో గురువారం వేకువజామున అందిన సమాచారంతో దేశమ్మ ఆలయం ఆర్చి వద్ద అనుమానాస్పదంగా కనిపించిన తమిళనాడు రాష్ట్రం అరక్కోణం మోసూరు గ్రామానికి చెందిన సిలంబరసన్ అలియాస్ అరసు(40), అరుళ్(38)లను అదుపులోకి తీసుకుని విచారించారు. నాలుగు నెలలుగా నగరి, పుత్తూరు, నారాయణవనం పరిసర ప్రాంతాల్లో బైక్‌లు, కారులోని ప్లేయర్లు చోరీ చేసి తిరుత్తణి, కాంచీపురం పరిసర ప్రాంతాల్లో విక్రయించేవారని గుర్తించారు. ఏకంగా నగరి ఆర్డీవో వాహన అద్దాలు పగులగొట్టి ప్లేయర్ చోరీకి యత్నించారు. కొన్ని వాహనాలు విజయపురం మండలంలో పన్నూరు సబ్‌స్టేషన్ వద్ద దాచి ఉంచినట్లు తేలింది. వీరి వద్ద నుంచి రూ.10 లక్షల విలువ చేసే ఎనిమిది బైకులను స్వాధీనం చేసుకున్నారు. అరసుపై తమిళనాడులో పలు కేసులున్నాయన్నారు. వీరిని రిమాండ్‌కు తరలించి, అనంతరం కస్టడీకి తీసుకుని ఇతర వాహనాలు, వస్తువులను రికవరీ చేయనున్నట్లు వెల్లడించారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ చూపిన నగరి, కార్వేటినగరం సీఐలు విక్రమ్, హనుమంతప్ప, ఎస్‌ఐ విజయనాయక్, సిబ్బంది తదితరులను అభినందించారు. రివార్డులకు సిఫార్సు చేశారు.

పెద్దిశెట్టిపల్లె విలేజ్ క్లినిక్‌లో నాక్స్ బృందం



పెద్దిశెట్టిపల్లి విలేజ్ క్లినిక్ వద్ద నాక్స్ బృందం

చిత్తూరు రూరల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు రూరల్ మండలంలోని పెద్దిశెట్టిపల్లె గ్రామంలో ఉన్న ఆయుష్మాన్ ఆరోగ్య మందిరంలో గురువారం నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్స్ (నాక్స్) అధికారి డాక్టర్ దివ్య పండిట్ తన బృందంతో కలిసి పరిశీలించారు. ఆరోగ్య కేంద్రంలో రోగులకు అందించే వైద్యం విషయంలో నాణ్యత ప్రమాణాలు పాటిస్తున్నారా? మౌలిక వసతులు తదితర విషయాలను గమనించారు. సౌకర్యాలను బట్టి ఈ ఆరోగ్య కేంద్రానికి మార్కులు ఇవ్వనున్నారు. వారివెంట అడిషనల్ డీఎంహెచ్‌వో వెంకటప్రసాద్, డీఐవో హనుమంతరావు, మెడికల్ ఆఫీసర్ సంధ్య, ఆశాలు, తదితరులు పాల్గొన్నారు.

పార్కు అభివృద్ధికి పక్కా ప్రణాళిక


పార్కు అభివృద్ధి ప్రణాళికను వివరిస్తున్న పీఎస్ఎం తదితరులు

కుప్పం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): కుప్పంలోని మున్సిపల్ పార్కు అభివృద్ధికి పక్కా ప్రణాళిక సిద్ధం చేసినట్లు ఏపీఎస్ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్.మునిరత్నం, కడా సలహా మండలి సభ్యుడు డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు తెలిపారు. కుప్పం మున్సిపల్ పార్కులో గురువారం సాయంత్రం పార్కు అభివృద్ధిపై ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డీకేపల్లె పార్కుతోపాటు, మున్సిపల్ పార్కులను రూ.22 కోట్లతో అభివృద్ధి చేయనున్నామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కుప్పం అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారన్నారు. ప్రజలు తగు సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. కొంతమంది పార్కుల అభివృద్ధికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు, పలువురు టీడీపీ నాయకులు, పట్టణ ప్రముఖులు, వివిధ వర్గాలకు చెందిన ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్ష


రిలే నిరాహార దీక్ష చేస్తున్న మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులు

పుంగనూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసమే రిలే నిరాహార దీక్షలు చేస్తున్నట్లు మున్సిపల్ ఇంజనీరింగ్ కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకులు తెలిపారు. రాష్ట్ర నేతల పిలుపు మేరకు పుంగనూరు మున్సిపల్ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్ష గురువారం 13వ రోజుకు చేరుకుంది. రాష్ట్ర ప్రభుత్వం చిన్న ఉద్యోగులపై చిన్న చూపు చూడకుండా ప్రస్తుతం పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘ నేతలు సుదర్శన్‌రాజు, జవర్‌లాల్ అలీ, భాను తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకత కోసమే ట్యాబ్‌ల పంపిణీ

● ఎమ్మెల్యే అమరనాథరెడ్డి


ఆర్పీలకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పలమనేరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): పారదర్శకత కోసమే ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్నట్లు పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పేర్కొన్నారు. గురువారం పలమనేరులోని ఆయన కార్యాలయంలో మున్సిపాలిటీ పరిధిలోని ఆర్పీలకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల బలోపేతం, మహిళా సాధికారత కోసం ప్రభుత్వం ఎన్నో పథకాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. అందులో భాగంగానే బ్యాంకు లింకేజీ సంఘ సభ్యులకు పారదర్శకంగా ఉండాలన్న ఉద్దేశంతో ఎలాంటి అవకతవకలు జరగకుండా పర్యవేక్షించడానికి ట్యాబ్‌లు ఉపయోగకరంగా ఉంటా యన్నారు. సంఘ సభ్యులకు సంబంధించిన డేటాను పూర్తిగా పొందుపర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎన్.వి.రమణారెడ్డి, మెప్మా మేనేజర్ బాబా, సీవోలు, టీడీపీ నాయకులు సుబ్రహ్మణ్యం గౌడు, గిరిబాబు, ఖాజా, బీఆర్‌సీ కుమార్, మదన్, శ్రీధర్, భాస్కర్ పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు


వాహనదారులను పరీక్షిస్తున్న పోలీసులు

సోమల, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు కేసులు నమోదు చేస్తామని సోమల ఎస్‌ఐ శివశంకర్ హెచ్చరించారు. గురువారం సోమల బస్టాండులో అతి వేగంగా ద్విచక్రవాహనాలు నడుపుతున్న వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిని పరీక్షించి రూ.10 వేలు అపరాధ రుసుం వసూలు చేశారు. పలు వాహనాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ప్రెస్, పోలీస్ పేర్లతో వాహనాలపై ఉన్న స్టిక్కర్లను తొలగించారు. హెల్మెట్ విధిగా ధరించాలని, మైనర్లకు ద్విచక్రవాహనాలు ఇవ్వరాదని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌సీ సురేష్, జ్వాన్, సురేష్, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మహిళా అభ్యున్నతే చంద్రబాబు ధ్యేయం


టైలరింగ్ శిక్షణ శిబిరాన్ని సందర్శించిన నాయకులు

రామకుప్పం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళల అభ్యున్నతే ధ్యేయంగా సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని వైస్ ఎంపీపీ వెంకట్రామగౌడు, నాయకులు రామ్మూర్తి, గుర్రప్ప తెలిపారు. గురువారం రామకుప్పం పట్టణ శివార్లలోని స్త్రీశక్తి భవనం వద్దనున్న ప్రభుత్వ మహిళల టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని సందర్శించారు. వారు మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగాలన్న సంకల్పంతో ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తోందన్నారు. సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థిక శక్తిగా ఎదగాలని కోరారు.

శ్రీనివాసులు కుటుంబానికి టీడీపీ ఆర్థికసాయం


ఆర్థికసాయం అందజేస్తున్న టీడీపీ నేతలు

రామకుప్పం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం విజలాపురం పంచాయతీ కిలాకిపోడుకు చెందిన రైతు శ్రీనివాసులు బుధవారం గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలిసిందే. గురువారం టీడీపీ సీనియర్ నేత శ్రీనివాసులురెడ్డి, పార్టీ పంచాయతీ అధ్యక్షుడు కుమార్ స్థానిక నేతలతో కలిసి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులకు పార్టీ తరపున రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని అందించారు. నేతలు రవి, భువన్‌రెడ్డి, గుర్రప్ప, ఉబేదుల్లా, ప్రసన్న, సుబ్బు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యల పరిష్కారానికే పల్లెనిద్ర

పుంగనూరు రూరల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సమస్యలు తెలుసుకొని పరిష్కరించడానికే పల్లెనిద్ర చేపడుతున్నామని పుంగనూరు సీఐ సుబ్బరాయుడు తెలిపారు. గురువారం రాత్రి మండలంలోని వనమలదిన్నె పంచాయతీ మేకనజామనపల్లెలో పల్లెనిద్ర చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడుతూ చిన్న చిన్న సమస్యలను గ్రామంలోనే పరిష్కరించుకోవాలన్నారు. కేసులు, కోర్టులు అని తిరిగితే సమయం వృథా కావడంతో పాటు కుటుంబాలు ఆర్థిక ఇబ్బందుల్లోకి వెళ్లడం ఖాయమన్నారు. కోడిపందేలు, పేకాట, గ్రామాల్లో మద్యం విక్రయాలు చేయరాదని సూచించారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పీఈఎస్‌లో మానసిక ఆరోగ్య వైద్య నిపుణుల నియామకం


డాక్టర్ సౌమ్యశ్రీ

కుప్పం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): కుప్పం పీఈఎస్ ఆసుపత్రిలో చిన్నపిల్లల మానసిక ఆరోగ్య వైద్య నిపుణులు సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ సౌమ్యశ్రీ మయూర్ కాకు నియమితులైనట్లు ఆసుపత్రి యాజమాన్యం తెలిపింది. ఈమె బెంగళూరులోని న్యూరో సైన్స్ ఇన్‌స్టిట్యూట్ నిమ్‌హాన్స్‌లో చిన్నపిల్లల కౌమార దశ సీనియర్ కన్సల్టెంట్‌గా పని చేశారన్నారు. ప్రజలు సౌమ్యశ్రీ వైద్య సేవలు వినియోగించుకోవాలని యాజమాన్యం కోరింది.

జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి

● సీనియర్ సివిల్ జడ్జి ఆదినారాయణ


సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ఆదినారాయణ

పలమనేరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): పలమనేరులో జూలై 5న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని పలమనేరు సీనియర్ సివిల్ జడ్జి ఆదినారాయణ సూచించారు. గురువారం సాయంత్రం కోర్టులో జాతీయ లోక్ అదాలత్‌పై సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవడంతో కలిగే ప్రయోజనాలను కక్షిదారులకు వివరించి అత్యధిక కేసుల పరిష్కారానికి న్యాయవాదులు సహకరించాలని కోరారు. సమావేశంలో జూనియర్ సివిల్ జడ్జి లిఖిత, పలమనేరు బార్ అసోసియేషన్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

గొర్రెలకు నట్టల నివారణ చర్యలు


గొర్రెలకు నట్టల నివారణ మందు తాపుతున్న వైద్యాధికారిణి

సోమల, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మేకలు, గొర్రెలు వివిధ రకాల వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు ఉచితంగా నట్టల నివారణ మందులు అందజేస్తున్నట్లు సోమల పశుసంవర్థకశాఖ ఏడీ శ్రీనివాసులు నాయుడు తెలిపారు. గురువారం సోమల మండలంలోని వల్లిగట్ల, కందూరు పరిధిలోని పలు మేకలకు, గొర్రెలకు పశువైద్యాధికారి చందనప్రియ ఉచితంగా నట్టల నివారణ మందులు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూలై 10వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమంతో ప్రతి గ్రామంలో నట్టల నివారణ మందులు అందజేయనున్నట్లు తెలిపారు. గొర్రెలు, మేకలు గుంటలు, చెరువుల వద్ద మేయడంతో కడుపులో పురుగులు చేరి వ్యాధుల బారిన పడటమే కాకుండా పెరుగుదల తగ్గిపోతుందన్నారు. 15 పంచాయతీల్లో 23,300 గొర్రెలకు, మేకలకు ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

విద్యార్థులను విలీనం చేయొద్దని నిరసన


విద్యార్థులతో కలసి నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

బైరెడ్డిపల్లె, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆకులకొత్తూరు ప్రాథమిక పాఠశాలలో 3, 4, 5 తరగతుల విద్యార్థులను ఇతర పాఠశాలలో విలీనం చేయరాదని గురువారం ఆకులకొత్తూరు ప్రాథమిక పాఠశాల ఎదుట విద్యార్థులతో కలిసి గ్రామస్తులు నిరసన తెలిపారు. తమ పిల్లలు దూరప్రాంతంలోని పాఠశాలకు వెళ్లిరావడం కష్టమని.. గ్రామంలోనే పాఠశాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. అధికారులు, నాయకులు చొరవ తీసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు.

ఇళ్లల్లో అన్నం తినలేకున్నాం..!

● మినీ బైపాస్ రోడ్డువాసుల ఆవేదన

పుంగనూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): సిమెంట్ ఇటుకల బట్టీ పరిశ్రమ కారణంగా తాము ఇళ్లల్లో అన్నం తినలేకపోతున్నామని.. శబ్దంతో పాటు సిమెంట్ దుమ్ము ఇళ్లల్లో నిండిపోతోందని పుంగనూరు మినీ బైపాస్ రోడ్డు జేఎండీ కల్యాణ మండపం రోడ్డు వాసులు వాపోతున్నారు. గురువారం స్థానికులు విలేకర్లతో మాట్లాడుతూ పరిశ్రమ నిర్వహణపై గత సోమవారం ప్రజా ఫిర్యాదుల దినంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని.. గతంలో ఈ విషయమై మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్లకు పలు పర్యాయాలు విన్నవించామన్నారు. అయితే ఎలాంటి చర్యలు లేవని వాపోయారు. ఊపిరితిత్తుల వ్యాధులు, చెవి, గొంతు తదితర అనారోగ్య సమస్యలతో అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పొల్యూషన్ నియంత్రణ బోర్డు బృందం వెంటనే పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

సమస్యలు తీర్చకుంటే సమ్మెకు వెనుకాడం

చిత్తూరు అర్బన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో ఔట్‌సోర్సింగ్ కింద పనిచేస్తున్న కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోతే నిరవధిక సమ్మెలోకి వెళ్లడానికి కూడా వెనుకాడబోమని మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ నేతలు హెచ్చరించారు. గురువారం నగరపాలక కార్యాలయంవద్ద కార్మికులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఆ సంఘ నేతలు మాట్లాడుతూ 36 జీవో ప్రకారం ఇంజనీరింగ్ కార్మికులకు 12వ పీఆర్సీ ప్రకారం జీతాలను పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం కార్మిక సంఘ నేతలను పిలిచి సమస్యలను పరిష్కరించకపోతే వచ్చే నెల 4వ తేదీ నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వాటర్, పార్కు, వెహికల్ డిపో మెకానిక్‌లు, డ్రైవర్లు, క్లీనర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, స్ట్రీట్ లైటింగ్, పారిశుధ్యం, టౌన్‌ప్లానింగ్ కార్మికులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘ నేతలు శివకుమార్ పాల్గొన్నారు.

కూలి కోసం.. కూటి కోసం..!

● క్వారీ ప్రమాదంలో గాయపడిన యువకుడి మృతి


ప్రమాదం జరిగిన ప్రాంతంలో విచారిస్తున్న మైనింగ్ అధికారులు


క్వారీ వద్ద ఉన్న యంత్రాలు


మృతుడు రాజు (ఫైల్ ఫొటో)

కుప్పం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): నిరుపేద కుటుంబానికి చెందిన రాజు (19) డిగ్రీ రెండో సంవత్సరం చదువుకుంటూనే క్వారీలో కూలి పనులకు వెళుతున్నాడు. ఈక్రమంలో అక్కడ జరిగిన ప్రమాదంలో మృతి చెందడం ప్రతి వ్యక్తినీ కదలించి వేస్తోంది.గుడుపల్లె మండలం పెద్ద బజనవాడ పంచాయతీ పాపానూరు గ్రామానికి చెందిన గోవిందప్ప, కళావతిల కుమారుడు రాజు కుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్నాడు. కూలీ పనులు చేసుకునే తల్లిదండ్రులకు చేదోడుగా ఉండాలని భావించాడు. వేసవి సెలవుల్లో తాను కూడా కూలీ పనులకు వెళ్లడానికి నిర్ణయించుకున్నాడు. కుప్పం పురపాలక సంఘం బేవనపల్లె రెవెన్యూ గ్రామ పరిధిలో, ఎన్టీఆర్ స్పోర్ట్స్ స్టేడియం వెనుక గల భూముల్లో క్వారీ పనులు జరుగుతున్నాయని తెలుసుకుని అక్కడ కూలీకి బండలు పగులగొట్టే పనిలో చేరాడు. కళాశాలలు పునఃప్రారంభమైనా పేద కుటుంబం కావడంతో కూటికి గడవని పరిస్థితుల్లో పనుల్లో కొనసాగుతున్నాడు. బుధవారం క్వారీలో బండలు పగులగొడుతుండగా రాజుతోపాటు శాంతిపురం మండలం సి.బండపల్లె పంచాయతీ బేవనపల్లెకు చెందిన రాజప్ప గాయపడ్డారు. తీవ్రంగా గాయపడిన రాజును తమిళనాడు రాష్ట్రం కృష్ణగిరిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అదేరోజు రాత్రి మృతి చెందాడు.

దిక్కును కోల్పోయిన కుటుంబం

రాజు కూలీ పనులు చేస్తున్న క్వారీ ఉన్నది ప్రభుత్వ భూముల్లో. బేవనపల్లె రెవెన్యూ గ్రామ పరిధిలోని 102/10, 11, 12, 13 సర్వే నెంబర్లలో 5.54 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఎన్టీఆర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ విస్తరణ, క్రిమిటోరియం నిర్మాణ పనులతోపాటు మరికొన్ని ప్రభుత్వ భవనాల నిర్మాణానికి ఈ స్థలాన్ని వినియోగించుకోవడానికి కడా నిర్ణయించింది. పేదరిక నిర్మూలనలో భాగంగా రాళ్లు కొట్టే కూలీలకు భూమిని చదునుచేసే పనులను అప్పగిస్తూ ఈ ఏడాది మార్చి నెల కడా పీడీ వికాస్ మర్మత్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులను ఆధారం చేసుకుని ఇక్కడ రాళ్ల గుట్టలను కొందరు పగులగొడుతున్నారు. పనిచేస్తూనే జరిగిన ప్రమాదంలో రాజు మృతి చెందాడు. అతని మృతితో అనాథగా మారిన ఆ యువకుడి కుటుంబానికి ప్రభుత్వం ద్వారా నష్టపరిహారం అందే పరిస్థితి లేదు. బేవనపల్లె రెవెన్యూ గ్రామ పరిధిలో భూమి చదును పనుల్లో లభించే ఇసుక, మన్ను, రాళ్లు వంటివాటిని కేవలం ప్రభుత్వ నిర్మాణ కార్యక్రమాలకే వినియోగించాలని కడా పీడీ ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొన్నారు. అయితే ఇక్కడ పెద్దపెద్ద యంత్రాలతో పనులు జరుగుతున్నాయి. క్వారీల్లో నుంచి వెలికి తీస్తున్న బండలను డ్రెస్సింగ్ చేసి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ప్రమాదం జరిగిన క్వారీ ప్రదేశాన్ని గురువారం భూగర్భ గనుల శాఖ అధికారులు పరిశీలించారు. స్థానికులను విచారించి వివరాలు నమోదు చేశారు. మధ్యవర్తులు కొందరు ముందుకు వచ్చి క్వారీ నిర్వాహకులకు, మృతుడి కుటుంబానికి మధ్య రాజీ కుదర్చడానికి ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. మృతుడు రాజు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు క్వారీ నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ పార్థసారధి తెలిపారు.

అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు

● చల్లా రామచంద్రారెడ్డి


కార్యాలయంలో మాట్లాడుతున్న చల్లా రామచంద్రారెడ్డి

రొంపిచెర్ల, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సాధించిన అభివృద్ధి, పథకాల అమలు గురించి ప్రజల్లోకి తీసుకెళ్లాలని పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం ఆయన స్థానిక పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, అధికారులతో సమావేశమై సమస్యలు అడిగి తెలుసుకున్నారు. చిన్న చిన్న సమస్యలు సంబంధిత అధికారులతో సంప్రదించి పరిష్కార చర్యలు తీసుకున్నారు. పాఠశాల సమీపంలో దారి వసతి కల్పించాలని బండకిందపల్లె గ్రామస్తులు చల్లా దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో రొంపిచెర్ల, సోమల టీడీపీ అధ్యక్షులు ఉయ్యాల రమణ, సుబ్రహ్మణ్యం నాయుడు, నాయకులు మణియాదవ్, మదన్ మోహన్‌రెడ్డి, కోటీశ్వరరెడ్డి, బారేషావల్లి, అమరనాథరెడ్డి, డీకే రామిరెడ్డి, ముద్దుకృష్ణ, వెంకటసుబ్బయ్య శెట్టి, మురళీనాయుడు, సుధాకర్ నాయుడు పాల్గొన్నారు.

టీడీపీ బలోపేతానికి సమష్టిగా కృషిచేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు

బైరెడ్డిపల్లె, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): గ్రామస్థాయి నుంచి టీడీపీని మరింత బలోపేతం చేయడానికి పార్టీశ్రేణులు కలిసికట్టుగా కృషిచేయాలని టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు కోరారు. బైరెడ్డిపల్లె రాయల్‌మహల్‌లో గురువారం మండలంలోని 21 పంచాయతీల టీడీపీ అధ్యక్షులు, కార్యదర్శులు, నాయకులు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కిశోర్‌గౌడు మాట్లాడుతూ గతయేడాది జరిగిన శాసనసభ ఎన్నికల్లో పలమనేరు నియోజకవర్గంలోనే బైరెడ్డిపల్లె మండలంలో టీడీపీకి అత్యధిక మెజారిటీ రావడానికి శాయశక్తులా కృషిచేసిన పార్టీశ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో రాబోయే స్థానిక ఎన్నికల్లోనూ టీడీపీని విజయపథంలో నడిపించాలని పిలుపునిచ్చారు. టీడీపీ సంస్థాగత ఎన్నికల పరిశీలకులు గోపీనాథ్ మాట్లాడుతూ క్రమశిక్షణకు మారుపేరైన టీడీపీలోనే కార్యకర్తలకు తగిన గుర్తింపు ఉంటుందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ అభివృద్ధికి కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యంశెట్టి, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

బడిబయట పిల్లల్ని గుర్తించాలి

సోమల, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని ఎంఈవో శివరత్న తెలిపారు. గురువారం సోమల, నంజంపేట గ్రామాల్లోని పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. బడిబయట పిల్లల్ని గుర్తించి హెచ్‌ఎంలు, ఎస్ఎస్ఏ సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. జూలై 12వ తేదీ వరకు ప్రక్రియ కొనసాగింపు జరగాలని సూచించారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

చౌడేపల్లె, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దకొండామారి చెరువు వద్ద జూదం ఆడుతుండగా ఐదుగురిని గురువారం అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ నాగేశ్వరరావు తెలిపారు. వారి నుంచి రూ.5,100 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

ట్రిపుల్ ఐటీకి 21 మంది విద్యార్థినుల ఎంపిక

బైరెడ్డిపల్లె, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మనపల్లె గురుకుల పాఠశాలలో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన 21 మంది విద్యార్థినులు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ శోభ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థినులను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

సంక్షేమాధికారికి కన్నీటి వీడ్కోలు

సదుం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): అకాల మృతి చెందిన ప్రభుత్వ సదుం బీసీ బాలికల వసతి గృహ సంక్షేమాధికారిణి మహేశ్వరి అంత్యక్రియలు గురువారం జరిగాయి. ఆమె మృతి పట్ల స్థానిక ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘ నాయకులు ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి తమ సంతాపం వ్యక్తం చేశారు. వారి స్వగ్రామం పాలమందలో జరిగిన అంత్యక్రియల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి సతీమణి కవితమ్మ, ఎంపీపీ మాధవి, మాజీ ఎంపీపీ పెద్దిరెడ్డి ఇందిరమ్మ, జడ్పీటీసీ సోమశేఖర రెడ్డి, నాయకులు పాల్గొని అంతిమ వీడ్కోలు పలికారు.

సాంఘిక బహిష్కరణ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

చిత్తూరు సిటీ, జూన్ 26(ఆంధ్రజ్యోతి): తనను సాంఘిక బహిష్కరణ చేసిన వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని కాణిపాకం గంగమ్మ జాతర కమిటీ ఛైర్మన్, కాంగ్రెస్ పార్టీ నేత పరదేశి కోరారు. గురువారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ గ్రామంలో గంగమ్మ జాతర నిర్వహణ కమిటీ ఛైర్మన్‌గా తాను ఉన్నానని చెప్పారు. గ్రామంలోని అగ్రకులస్తులు గ్రామస్తులను భయపెట్టి తనతో కలవకుండా తనను బహిష్కరించేలా చేశారని ఆరోపించారు.

నోటు పుస్తకాల పంపిణీ

ఐరాల(కాణిపాకం), జూన్ 26(ఆంధ్రజ్యోతి): కాణిపాకం ఎంపీయూపీ పాఠశాల విద్యార్థులకు గురువారం ఇటీవల పాఠశాలలో పదవీ విరమణ చేసిన విశ్రాంత ఉపాధ్యాయుడు సురేష్ నోటు పుస్తకాలు, పలకలు, పెన్నులు విరాళంగా అందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో జీవితాలు అంధకారం

● ఎమ్మెల్యే అమరనాథరెడ్డి


పలమనేరులో ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి


కుప్పంలో ప్రజలచే ప్రతిజ్ఞ చేయిస్తున్న పోలీసు అధికారులు


పుంగనూరులో...

పలమనేరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలతో జీవితాలు అంధకారం చేసుకోరాదని.. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి సూచించారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నివారణ దినోత్సవం సందర్భంగా పలమనేరు పోలీసుశాఖ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం మాదక ద్రవ్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హాజరై మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని విద్యార్థులు, యువతచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. వెంకటేశులు, డీఎస్పీ డేగల ప్రభాకర్, సీఐలు నరసింహరాజు, మురళీ, ప్రసాద్, ఎస్‌ఐలు స్వర్ణతేజ, లోకేష్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఎన్.వి.రమణారెడ్డి, కళాశాల అధ్యాపకులు, సిబ్బందితో పాటు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

● **కుప్పం:** మాదక ద్రవ్యాలతో జీవితాలు ధ్వంసమవుతాయని డీఎస్పీ పార్థసారథి అన్నారు. కుప్పంలో గురువారం సాయంత్రం మాదకద్రవ్య వ్యతిరేక దినోత్సవాన్ని పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. పట్టణంలో ర్యాలీ జరిపి, ఆర్టీసీ బస్టాండు కూడలిలో మానవహారం ఏర్పాటు చేశారు. కుప్పం అర్బన్, రూరల్ సీఐలు శంకరయ్య, మల్లేశ్ యాదవ్, నాలుగు మండలాల ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

● **పుంగనూరు రూరల్:** మాదక ద్రవ్యాలను దూరం చేయడానికి యువత ముందుకు రావాలని పుంగనూరు సీఐ సుబ్బరాయుడు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక ఎస్వీ కళాశాల విద్యార్థులతో కలిసి పుంగనూరు పురవీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి, ఎస్‌ఐ రమణ, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రజాదర్బార్

చిత్తూరు సిటీ, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ కార్యాలయంలో శుక్రవారం 'ప్రజా సమస్యల పరిష్కారవేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక లక్ష్మీనగర్ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో 'ప్రజా ఫిర్యాదుల స్వీకరణ' కార్యక్రమాన్ని ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నంవరకు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ప్రజలు వినతి పత్రాలతోపాటు ఆధార్‌కార్డు జిరాక్స్ పత్రాన్ని జతచేయాలని తెలిపారు.

కారు, ట్రాక్టర్ ఢీ - తప్పిన ప్రమాదం

గుడిపాల(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన గుడిపాల క్రాస్‌లో గురువారం రాత్రి కారు, ట్రాక్టర్ ఢీకొన్నాయి. చిత్తూరు నుంచి వేలూరువైపు వస్తున్న కారు, పెట్రోల్‌బంకు నుంచి చిత్తూరు వైపు వస్తున్న ట్రాక్టర్ గుడిపాల క్రాస్‌వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఆ సమయానికి పాదచారులు రాకపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. కారు డ్రైవర్ స్వల్పంగా గాయపడ్డాడు.

ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య


పాఠశాలలో చేర్పించమని అభ్యర్థిస్తున్న టీచర్లు

గుడిపాల, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలల్లో వసతుల కన్నా ప్రభుత్వ పాఠశాల్లోనే అన్ని సౌకర్యాలు ఉన్నాయని పానాటూరు హైస్కూల్ టీచర్లు చెప్పారు. గురువారం స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ఎలిమెంటరీ స్కూల్ నుంచి హైస్కూల్ వరకు అప్‌గ్రేడ్ అయిందని, ప్రభుత్వం అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేసిందన్నారు. హెచ్‌ఎం శేఖర్, టీచర్లు చంద్రశేఖర్, వేద, రేవతి, ధనమ్మ, జవహర్‌రెడ్డి, వైదేహి, తిరుమల రెడ్డి, మోహన్‌రావు, శారద, గుణశేఖర్ పాల్గొన్నారు.

నేటి నుంచి దిగువమాఘంలో మహాభారత యజ్ఞం

తవణంపల్లె, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దిగువమాఘంలో శుక్రవారం నుంచి మహాభారత యజ్ఞం ప్రారంభమవుతుందని ధర్మకర్త ఉమాపతిరెడ్డి, గ్రామస్తులు తెలిపారు. గ్రామ సమీపంలో బాహుదానది ఒడ్డున వెలసిన ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో మాజీ మంత్రి గల్లా అరుణకుమారి, గల్లా రామచంద్ర నాయుడుల సహకారంతో 21రోజుల పాటు మహాభారత యజ్ఞం నిర్వహించనున్నట్లు ధర్మకర్త తెలిపారు.

అంగన్వాడీ కేంద్రాలను సక్రమంగా నిర్వహించాలి

పాలసముద్రం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగన్వాడీ కేంద్రాలను సిబ్బంది సక్రమంగా నిర్వహించాలని జీడీ నెల్లూరు సీడీపీవో పద్మసునంద సూచించారు. గురువారం మండలంలోని ఆముదాల, పాలసముద్రం, సింహరాజుపురం అంగన్వాడీ కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ కేంద్రాల్లో రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు.

ఆరిమాని గంగమ్మకు పూజలు

శ్రీరంగరాజపురం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ఎస్‌ఆర్‌పురం మండలం ఆరిమాని గంగమ్మకు గురువారం మండల జనసేన పార్టీ ఉపాధ్యక్షుడు చందు జన్మదిన సందర్భంగా కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు వెంకటాచలపతి అమ్మవారిని ప్రత్యేక అలంకరించి, భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఆలయ కమిటీ సభ్యులు పైనేని ధనంజయులు, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.


పీవీకేఎన్ డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ జీవనజ్యోతి - నగరిలో జరిగిన ర్యాలీలో పాల్గొన్న డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్

యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

చిత్తూరు సెంట్రల్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని పీవీకేఎన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జీవనజ్యోతి సూచించారు. అంతర్జాతీయ మాదక ద్రవ్య వినియోగ వ్యతిరేక దినోత్సవాన్ని స్థానిక కళాశాలలో గురువారం నిర్వహించారు. ప్రిన్సిపాల్‌తో పాటు డీఎల్ఎస్ఏ కార్యదర్శి భారతి మాట్లాడుతూ కుటుంబానికి సమాజానికి ఎంతో ఉపయోగపడాల్సిన యువత వీటికి బానిస కావడం ద్వారా జీవితాలు నష్టపోతున్నారన్నారు. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్ మాట్లాడుతూ తొలుత పొగాకుకు బానిసై ఆపై మాదక ద్రవ్యాలవైపు మొగ్గు చూపుతున్నారని, వీటితో పాటు మద్యపానం చేయడం ఆరోగ్యానికి ఎంతో కీడు తెస్తోందన్నారు. సమావేశంలో జిల్లా మహిళా శిశు సంక్షేమం, ఉపాధి అధికారి వెంకటేశ్వరి, జిల్లా ఎక్సైజ్ అధికారి శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ● స్థానిక రాంనగర్ కాలనీలోని హార్వర్డ్ స్కూల్లో కరస్పాండెంట్ భాస్కర్ 8,9,10 తరగతుల విద్యార్థులకు మాదక ద్రవ్యాల ద్వారా కలిగే అనర్థాలను వివరించారు.

● పూతలపట్టు (ఆంధ్రజ్యోతి): పూతలపట్టు మండల కేంద్రంలో సీఐ కృష్ణమోహన్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ర్యాలీ నిర్వహించారు. పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

● చిత్తూరు అర్బన్(ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాల నివారణపై పాస్, డీడీఏసీ సిబ్బంది గాంధీ విగ్రహం వద్ద అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రయాణికులకు, ఆటోడ్రైవర్లకు, విద్యార్థులకు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించి, కరపత్రాలను పంచిపెట్టారు.

● పాలసముద్రం (ఆంధ్రజ్యోతి): ఎస్ఐ చిన్నరెడ్డెప్ప ఆధ్వర్యంలో బలిజకండ్రిగ జడ్పీ హైస్కూల్ నుంచి బలిజకండ్రిగ కాలనీ వరకు విద్యార్థులు, పోలీసులు ర్యాలీ నిర్వహించారు.

● నగరి (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాలకు యువత, విద్యార్థులు దూరంగా ఉండాలని డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్ సూచించారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై యువతకు అవగాహన కల్పిస్తూ పట్టణ పరిధిలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీఐ విక్రమ్, మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి, ఎస్సైలు, పోలీసులు, కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

● చిత్తూరు రూరల్ (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాల వినియోగంతో భవిష్యత్తు అంధకారమవుతుందని అపోలో యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ జయప్రియ అన్నారు. అపోలో యూనివర్సిటీలో డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న సమస్య అని తెలిపారు. వీటి వల్ల కుటుంబాలు విచ్ఛిన్నం అవుతున్నాయని వివరించారు. స్కూల్ ఆఫ్ హెల్త్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


అపోలో యూనివర్సిటీలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ డాక్టర్ జయప్రియ

● గంగాధరనెల్లూరు (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు సీఐ శ్రీనివాసంతి ఆధ్వర్యంలో స్థానిక హైస్కూల్ టీచర్లు మధుసూదన్‌రెడ్డి, వి.లక్ష్మీపతి భాస్కర్‌రెడ్డి, ఎజ్.జి.లక్ష్మీపతి, రవి, ఫిజికల్ డైరెక్టర్ లోకేష్‌లతో పాటు విద్యార్థినీ, విద్యార్థులచే గ్రామవీధుల్లో ర్యాలీ నిర్వహించారు.

● వెదురుకుప్పం (ఆంధ్రజ్యోతి): మత్తు వదిలి ఆరోగ్యాన్ని రక్షించుకోవాలంటూ కార్వేటినగరంలో డైట్ ఛాత్రోపాధ్యాయులు ర్యాలీ చేపట్టారు. డ్రగ్స్ వాడకం వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ పురవీధుల్లో ప్రదర్శనలు నిర్వహించారు. డైట్ అధ్యాపకులు, ఛాత్రోపాధ్యాయులు, పోలీసులు పాల్గొన్నారు. ● సీఐ హనుమంతప్ప ఆధ్వర్యంలో కార్వేటినగరంలో అవగాహన కల్పించారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం మేము సైతం అంటూ కార్వేటినగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ విజయులురెడ్డి, ఎన్ఎస్ఎస్ పీవో డాక్టర్ ధనంజయరెడ్డి, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.


కార్వేటినగరంలో డైట్ అధ్యాపకులు, ఛాత్రోపాధ్యాయుల ర్యాలీ

సమస్యలు తీర్చకుంటే సమ్మెకు వెనుకాడం


నిరసన తెలుపుతున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు


చిత్తూరు అర్బన్, జూన్ 26 (ఆంధ్ర జ్యోతి): మున్సిపాలిటీలో ఔట్‌సోర్సింగ్ కింద పనిచేస్తున్న కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోతే నిరవధిక సమ్మెలోకి వెళ్లడానికి కూడా వెనుకాడబోమని మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ నేతలు హెచ్చరించారు. గురువారం నగరపాలక కార్యాలయంవద్ద కార్మికులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఆ సంఘ నేతలు మాట్లాడుతూ 36 జీవో ప్రకారం ఇంజనీరింగ్ కార్మికులకు 12వ పీఆర్సీ ప్రకారం జీతాలను పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం కార్మిక సంఘ నేతలను పిలిచి సమస్యలను పరిష్కరించకపోతే వచ్చే నెల 4వ తేదీ నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వాటర్, పార్కు, వెహికల్ డిపో మెకానిక్‌లు, డ్రైవర్లు, క్లీనర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, స్ట్రీట్ లైటింగ్, పారిశుధ్యం, టౌన్‌ప్లానింగ్ కార్మికులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘ నేతలు శివకుమార్, శివప్రసాద్, వెంకటేశ్, డియా, శంకర్, సునీల్, గోపాలాచారి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వందడుగుల రోడ్డు విస్తరణకు ముందుకొచ్చిన ప్రజలు


వంద అడుగుల స్థలం వరకు తొలగింపు కార్యక్రమాన్ని చేపడుతున్న అధికారులు

చిత్తూరు అర్బన్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): హైరోడ్డు విస్తరణలో భాగంగా ప్రైవేటు భవన యజమానిని ఒప్పించి వంద అడుగులకు సంబంధించిన స్థలాన్ని గురువారం టౌన్ ప్లానింగ్ అధికారులు తొలగించారు. గత వారం రోజులుగా హైరోడ్డు విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌ల మార్గనిర్దేశంతో కమిషనర్ నరసింహ ప్రసాద్ ఆదేశాల మేరకు కట్టమంచి ప్రాంతంలో విస్తరణ పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో కట్టమంచి ఎంఆర్ఎఫ్ టైర్స్ పక్కన ఉన్న ప్రైవేటు స్థలానికి సంబంధించిన యజమానిని ఒప్పించి వంద అడుగులకు కావాల్సిన స్థలాన్ని ఎక్స్‌కవేటర్ సహాయంతో తొలగించారు. ఏసీపీ నాగేంద్ర మాట్లాడుతూ రోడ్డు విస్తరణకు భవన యజమానులు ముందుకురావడం సంతోషకరమన్నారు. విస్తరణకు సహకరించిన జయచంద్రారెడ్డి కోల్పోయిన స్థలానికి గాను టీడీఆర్‌బాండ్‌ను ప్రభుత్వం నుంచి అందిస్తామని తెలిపారు. టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను విస్తృతంగా ప్రచారం చేయాలి


మాట్లాడుతున్న కోదండయాదవ్

పాలసముద్రం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి టీడీపీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు విస్తృతంగా ప్రచారం చేయాలని ఆపార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్ పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని వనదుర్గాపురం, ఎస్ఆర్ఆర్‌కండ్రిగ, కేజేపురం, శ్రీకావేరిరాజుపురం, సింహరాజుపురం, పాలసముద్రం పంచాయతీల టీడీపీ సంస్థాగత ఎన్నికలను నిర్వహించారు. ఐదు పంచాయతీలలో టీడీపీ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వనదుర్గాపురం పంచాయతీ అధ్యక్షుడిగా రామకృష్ణమరాజు, ప్రధాన కార్యదర్శిగా సుబ్రహ్మణ్యం యాదవ్, ఎస్ఆర్ఆర్‌కండ్రిగ అధ్యక్షుడిగా కృష్ణమ నాయుడు, ప్రధానకార్యదర్శిగా మునీంద్రన్, సింహరాజుపురం అధ్యక్షుడిగా చెంగమండడి, ప్రధానకార్యదర్శిగా చిన్నదొరై, పాలసముద్రం అధ్యక్షుడిగా రాఘవన్, ప్రధానకార్యదర్శిగా వెంకటేశులు నాయుడు, శ్రీకావేరిరాజుపురం అధ్యక్షుడిగా వెంకటప్ప నాయుడు, కేజీపురం పంచాయతీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు పోటీ ఎక్కువ కావడంతో ఎన్నికను వాయిదావేశారు. పాలసముద్రం యూనిట్ కన్వీనర్‌గా జె.విజయ్‌కుమార్, కో-కన్వీనర్‌గా వాసుయాదవ్ ఎంపికయ్యారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి భీమినేని చిట్టిబాబు నాయుడు, నాయకులు వాసు నాయుడు, తాళ్లూరు శివానాయుడు, సి.రాజేంద్రన్, శేఖర్‌రాజు, అరుళ్‌నాథన్ తదితరులు పాల్గొన్నారు.

సాంఘిక బహిష్కరణ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

చిత్తూరు సిటీ, జూన్ 26(ఆంధ్రజ్యోతి): తనను సాంఘిక బహిష్కరణ చేసిన వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని కాణిపాకం గంగమ్మ జాతర కమిటీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ నేత పరదేశి కోరారు. గురువారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ గ్రామంలో గంగమ్మ జాతర నిర్వహణ కమిటీ చైర్మన్‌గా తాను ఉన్నానని చెప్పారు. గ్రామంలోని అగ్రకులస్తులు గ్రామస్తులను భయపెట్టి తనతో కలవకుండా తనను బహిష్కరించేలా చేశారని ఆరోపించారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి, గ్రామంలో విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని కోరారు.

అందుబాటులో నట్టల నివారణ మందు

వెదురుకుప్పం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): పశువైద్య కేంద్రాల్లో నట్టల నివారణ మందు అందుబాటులో ఉందని పుత్తూరు పశుసంవర్ధకశాఖ ఉప సంచాలకులు డాక్టర్ గోవిందయ్య, వెదురుకుప్పం పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ రూపసుందరి తెలిపారు. సన్న జీవాలకు నట్టల నివారణ మందు తాగించే కార్యక్రమాన్ని వెదురుకుప్పం మండలం చవటగుంటలో గురువారం ప్రారంభించారు. మండలంలో 44,500 గొర్రెలు, మేకలు ఉన్నాయని తెలిపారు. కడుపులోని నులిపురుగుల నిర్మూలనకు, వాటి ఎదుగుదలకు నట్టల నివారణ మందు దోహదం చేస్తోందన్నారు. పశువైద్యాధికారి డాక్టర్ రాజేష్, గణేష్, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ వైద్య సేవను మెరుగుపరచాలి


కార్వేటినగరం సీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న డీసీహెచ్ఎస్

వెదురుకుప్పం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వైద్య సేవను మెరుగుపరచాలని డీసీహెచ్ఎస్ పద్మాంజలి ఆదేశించారు. గురువారం కార్వేటినగరం సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని (సీహెచ్‌సీ) ఆమె తనిఖీ చేశారు. ఓపీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. డెలివరీ కేసుల వివరాలు, ఇతరత్రా వివరాలపై ఆరా తీశారు. ఆస్పత్రి భవన నిర్మాణపనులను పరిశీలించారు.

● నగరి (ఆంధ్రజ్యోతి): నగరి ఏరియా ఆస్పత్రిని డీసీహెచ్ఎస్ డాక్టర్ పద్మాంజలిదేవి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆమె రోగులతో మాట్లాడుతూ ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులు, సిబ్బందికి సూచించారు. అనంతరం సీపీఐ కార్యదర్శి కోదండయ్య శానిటరీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న మూడు నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రభావతి, డాక్టర్ మంజుల, జరీనా, ప్రశాంతి, దీప్తి శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ

ఐరాల(కాణిపాకం), జూన్ 26(ఆంధ్రజ్యోతి): కాణిపాకం ఎంపీయూపీ పాఠశాల విద్యార్థులకు గురువారం ఇటీవల పాఠశాలలో పదవీ విరమణ చేసిన విశ్రాంత ఉపాధ్యాయుడు సురేష్ నోటు పుస్తకాలు, పలకలు, పెన్నులు విరాళంగా అందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జ్యూస్ బండిని ఢీకొన్న కారు

పూతలపట్టు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): జ్యూస్ బండిని ఓ కారు ఢీకొన్న సంఘటనలో ప్రమాదం త్రుటిలో తప్పింది. మండలంలోని రంగంపేట క్రాస్ ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద రాజస్థాన్‌కు చెందిన ఓ యువకుడు బతుకుతెరువు కోసం ఓ జ్యూస్ బండిని ఏర్పాటుచేసుకుని శీతలపానీయాలను విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో పీలేరు నుంచి బెంగళూరుకు వెళ్తున్న ఓ కారు అదుపుతప్పి జ్యూస్ బండిని ఢీకొంది. ఈ ప్రమాదంలో జ్యూస్ బండి కొంత మేర దెబ్బతిన్నా, ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. దీంతో త్రుటిలో పెనుప్రమాదం తప్పిందని స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.

తహసీల్దార్‌కు సన్మానం


తహసీల్దార్ శ్రీనివాసులును సన్మానిస్తున్న రేషన్‌షాపు డీలర్లు

గంగాధరనెల్లూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు మండలానికి కొత్త తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన సి.కె.శ్రీనివాసులును మండలంలోని పలువురు రేషన్‌షాపు డీలర్లు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువకప్పి పూలమాలతో సన్మానం చేశారు. కార్యక్రమంలో మండల రేషన్‌షాపు డీలర్ల సంఘం అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, డీలర్లు మోహన్‌రెడ్డి,తులసిరెడ్డి,విజయకుమార్‌రెడ్డి, హేమాద్రి నాయుడు, ధనంజయరెడ్డి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తూగుండ్రం పీహెచ్‌సీ డాక్టర్ బాధ్యతల స్వీకరణ

గంగాధరనెల్లూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూగుండ్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్‌గా బి.ప్రవీణ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కేంద్రంలోని డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయం నుంచి బదిలీపై తూగుండ్రంకు వచ్చారు.

ఉచిత వైద్య శిబిరం

చిత్తూరు కల్చరల్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): స్థానిక లాలూ గార్డెన్స్‌లో గురువారం సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. నగరంలోని తోటపాళ్యం విన్ ఆస్పత్రి వైద్యుల సహకారంతో దాదాపు 120 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు, కంటి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. సత్యసాయి సేవా సంస్థల మెడికల్ ఇంచార్జి మనోహర్, నగర్ కన్వీనర్ ప్రభాకర్ నాయుడు, గణేష్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శికి సన్మానం

గంగాధరనెల్లూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): తూగుండ్రం పంచాయతీ కొత్తకార్యదర్శిగా గురువారం బాధ్యతలు స్వీకరించిన శిరీషను సర్పంచ్ శ్రీబాబు, టీడీపీ నేతలు నియాజ్‌అలీ, జీవరత్నం, శాంతకుమార్, నీరజాక్షులురెడ్డి, సంపత్, శంకర్, కాణిపాకం సుధాకర్, సచివాలయంలో శాలువతో సన్మానించారు.